# విషయసూచిక


| | | | పుట |
|---|---|---|---|
| తొలిపలుకు | | .... | ix |
| మనవి | .... | .... | xi |
| అన్నమాచార్యుని కవిత - శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ | | | xiv |
| సంకీర్తనల గానం - శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ | | .... | xxii |
| సంకీర్తనలు | .... | .... | 1 |
| అనుబంధం — 1 సంకీర్తనల అకారాది సూచిక | | .... | 61 |
| అనుబంధం — 2 లఘువివరణ | .... | .... | 64 |

## శ్రీరాగం

పల్లవి:

దినము ద్వాదశి నేఁడు - తీర్థదివసము నీకు
జనకుండ అన్నమాచార్యుఁడ విచ్చేయవే. ॥ దినము ॥

చరణములు:

అనంత గరుడ ముఖ్యులైన సూరిజనులతో
ఘననారదాది భాగవతులతో
దనుజమర్దనుఁడైన - దైవశిఖామణితోడ
వెనుగొని యారగించ - విచ్చేయవే. ॥ దినము ॥

వైకుంఠాన నుఁడి యాళువారల లోపలనుండి
లోకపు నిత్య ముక్తుల - లోననుండి
శ్రీకాంత తోడ నున్న - శ్రీవేంకటేశుఁగూడి
యీకడ నారగించ - నింటికి విచ్చేయవే. ॥ దినము ॥

సంకీర్తనముతోడ - సనకాదు లెల్లఁదాడ
పొంకపు శ్రీవేంకటాద్రి - భూమినుండి
లంకె శ్రీవెంకటగిరి - లక్ష్మివిభుఁడు నీవు
సంకెల మా యింటివిందు లారగించవే. ॥ దినము ॥

(పెదతిరుమలాచార్యులు)

# తొలిపలుకు

"అంతరంగమునఁ దాను హరిఁ దలచినఁ జాలు
అంతటి మీద పను లాతడే యెరుఁగు"

అని తన జీవితాన్ని వేంకటేశ్వరార్పణం చేసి నిశ్చింతగ ఆత్మ కల్యాణంతోబాటు లోక కల్యాణాన్నికూడ సాధించిన మహాభాగవతోత్తముడు తాళ్లపాక అన్నమాచార్యులు. లేకున్న ఇంత సారస్వతరాశిని ఒక్క వ్యక్తి తన జీవిత కాలంలో సాధించడం సామాన్యమైన పని కాదు. ఈ సాధ్యానికి వారు ఉపయోగించిన సాధనం శరణాగతి. ఇది 'బ్రహ్మానంద వేదాంత రహస్య'మని ఈ భక్త కవే లోకానికి చాటి చెప్పినాడు.

తాళ్లపాక కవుల కృతులు ఇప్పటికి 25 సంపుటాలలో తీరినవి. అన్నమాచార్యుల కుమారుడు పెదతిరుమలాచార్యులు, వారి కుమారుడు చిన తిరుమలాచార్యులు చేసిన రచనలు, మాకందినంతవరకు రేకులలో ఉన్నవన్నీ పూర్తిగ ముద్రణకెక్కినవి. అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలన్నీ ఎన్నడో ముద్రణభాగ్యం పొందినవి. ఆ సంపుటాల ప్రతులు ఒక్కటికూడ మిగులలేదు. వానిని పునర్ముద్రించే ప్రయత్నం లోనే ఉన్నాము. ఇక అన్నమాచార్యుల శృంగార సంకీర్తలు ఇప్పటికి పదకొండు సంపుటాలలో అవతరించినవి. ఇంక సుమారు 5000 కీర్తనలు ముద్రణకెక్కవలసి ఉన్నవి. వాని పరిష్కరణ, ప్రకటన సాగుతూనే ఉన్నది. రాబోవు సంపుటాలు మునుపటివలె వంద రేకులలోని పాటలతో కాక యాభై రేకుల పాటలతోనే వెలువడగలవు. పాఠకులకు, గాయకులకు ఈ సంపుటములు చేతి కదనుగా ఉండి, సౌలభ్యము నాపాదించవలెననే మా ఆశయం.

అన్నమాచార్యులు దివ్యధామము నంది నేటికి సరిగ్గా 474 సంవత్సరాలైనది. మేము అన్నమాచార్య వర్ధంతి ఉత్సవమును 1948 లో ప్రారంభించినాము. నేడు మనము జరుపుకొనేది అన్నమాచార్యుల 30 వ వర్ధంతి. వారి జనన మరణాలకు సంబంధించిన తేదీలు రాగిరేకులమీదనే మలచబడి ఉన్నవి. అన్నమాచార్యులు పరమపదించిన దినమును

వర్ధంతి ఉత్సవముగ నిర్వహిస్తున్న మేము ఈ సంవత్సరం నుండి వారి జన్మతిథిని జయంత్యుత్సవముగా చేయదలచినాము.

మునుపటివలెనే ఈ వర్ధంతినాడు కూడ ఆ మహాభక్తునికి సేవా కైంకర్యంగా మరొక చిరుకానుక అందిస్తున్నాము. సంగీత సాహిత్య కళాప్రియుల కందరికీ అందుబాటులో ఉండేటట్లుగానే ఈ సంకలనాన్ని సిద్ధం చేసినాము. దీనిని ఎంతో శ్రద్ధాభక్తులతో నిర్వహించినవారు అన్నమాచార్యుల వాఙ్మయం గురించి పరిశోధన సాగిస్తున్న కామిశెట్టి శ్రీనివాసులుశెట్టిగారు. అన్నమాచార్యుల 'వేంకటేశ్వర శతకము,' 'భజన సంప్రదాయ కీర్తనలు' కూడ వీరి పరిశోధనా దృష్టికందినవి. వానిని పరిష్కరించి ప్రకటించే బాధ్యతకూడ వీరికే అప్పగించినాము. అవికూడ త్వరలో వెలుగు చూడగలవు. కర్ణాటక సంగీతమునకు తమిళ విద్వాంసులు చేసిన, చేస్తున్న సేవ సాటిలేనిది. అన్నమాచార్యుల సంకీర్తనలను పాడి ప్రచారం చేయుటకు వారెంతో ఉత్సాహమును, ఆసక్తిని వ్యక్తం చేస్తున్నారు. తమిళ విద్వాంసుల సౌకర్యార్థం అన్నమాచార్యుల సంకీర్తనలను కొన్నిటిని అరవలిపిలో సస్వరముగ ప్రకటింపదలచినాము.

సుప్రసిద్ధ సంగీత విద్వాంసు లెందరో అన్నమాచార్యుల కృతులకు స్వరాలు సంతరించి గానంచేసి దేశవ్యాప్తం చేస్తున్నారు. వారికి మా హార్దమైన ధన్యవాదములు. తిరుపతిలో ప్రతి శనివారం జరిగే అన్నమాచార్య సారస్వతకళారాధనలో పాల్గొని మా సంగీతకళాశాల విద్వాంసులు ఈ సంకీర్తనల ప్రచారానికి ఎంతో సహకరిస్తున్నారు. వారి కృషి అభినందనీయమైనది.

ఈ పాటలలోని రసానుభవమును ప్రజల కందరికిని పంచిపెట్ట వలసిన బాధ్యత భావుకులైన పండితులు, గాయకులమీదనే ఉన్నది.

"పంతమున నాతనిపై భారము వేసినచాలు
నింత ఉద్యోగములు గోవిందుడే యెరుగు"

తిరుపతి,
24—3—78

పి. యస్. రాజగోపాలరాజు,
ప్రకాశకులు.

# మనవి

"వేడుకకు వెలలేదు వెన్నెలకు కొలలేదు."

గత నాలుగైదేండ్లగ తాళ్లపాక కవుల సంకీర్తన వాఙ్మయంలో శ్రద్ధాళువులైన పరిశోధకులు నిర్మాణాత్మకమైన కృషిని సాధించినారు. ఈ పదకవితలపై చిన్నచూపును వదలి విశాలమైన దృష్టితో ఇందలి భాషా సాహిత్య సౌందర్యాలను ఆవిష్కరించడానికి సాహిత్యంవాళ్లు పూనుకొన్నారు. ఈ సంకీర్తనల్లో చాలినంత సంగీతం లేదనే చింతమాని పండిత పామరరంజకమైన వర్ణమెట్లను కుదిరించి సంగీత విద్వాంసులు కచ్చేరీలలో పాడుతున్నారు. ఈ పదరచనలలో అభినయాంశాన్ని గుర్తించి ఉద్ధరించడానికి నాట్యకోవిదులు ప్రయత్నిస్తున్నారు. ఈ భక్తి వాఙ్మయంలో దాగివున్న వేదాంతరహస్యాలను వెలికి తీయడానికి, ఇంతవరకు నైఘంటికుల దృష్టిలోపడని అనంత శబ్దరాశిని నిఘంటువుల కెక్కించడానికి పండిత పరిషత్తులు అంతులేని ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్నవి. కళాప్రపంచంలో ఈ తాళ్లపాకవారి వాఙ్మయంమీద ఇంత శ్రద్ధ ఏర్పడడానికి ప్రధానకారణం తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వాహకులే. రాగిరేకులమీది సంకీర్తనలను పండితులచే పరిష్కరింపజేసి సంపుటాలుగ ప్రకటిస్తున్నారు. సుప్రసిద్ధ గాయకులను ఆహ్వానించి పాటలకు స్వరరచనలు చేయించి, పాడించి ప్రచారం చేస్తున్నారు. ఏటేట అన్నమాచార్యుల వర్ధంతి ఉత్సవాలతోపాటు జయంత్యుత్సవాలను కూడ జరపడానికి తీర్మానించినారు. విశ్వవిద్యాలయస్థాయిలో ఎం. ఏ. విద్యార్థులకు అన్నమాచార్యుల సంకీర్తనలను ప్రత్యేక పాఠ్యభాగంగ నిర్ణయించడమే కాకుండ, సిద్ధాంత వ్యాసంగానికి పరిశోధనాంశంగ యివ్వడం జరిగింది. ఈ వాఙ్మయం ఇంత దీప్తిని, వ్యాప్తిని పొందిన ఈ కాలాన్ని నిజంగ తాళ్లపాక సారస్వతపునరాలోచనము, పునర్వికాసము అని చెప్పవచ్చు.

ఈ వాఙ్మయ మహాయజ్ఞ నిర్వహణలో నాదొక చిన్న పాత్ర. ఈ మహాభాగవత సేవాకైంకర్యంలో నాకొక అవకాశలేశము లభించినది. ఈ కార్యనిర్వహణలో నాకున్న శక్తి, భక్తి; సామర్థ్యము, శ్రద్ధ; ఇంతకు మించిన ప్రసంగం అధికమే ఔతుంది. "త్రికరణశుద్ధిగ చేసిన పనులు దేవుడు

మెచ్చు లోకమును మెచ్చును" అను అన్నముని మాటల యందలి విశ్వాసమే నాకు వూపిరి.

ఈ "అన్నమాచార్యుల సంకీర్తనలు" దేవస్థానంవారు నిండుమనస్సుతో తెలుగువారికి అందించే ద్వితీయ పుష్పం. నేల నాలుగు చెరగులా నలుగురూ ఈ సంకీర్తన సుమసౌరభాన్ని తృప్తిగ ఆఘ్రాణించి ఆనందించాలనే వీరి సంకల్పం. మునుపటివలెనే ఈ 'కూర్పుపనిని' నాకు దయతో అప్పగించిన వారు రసహృదయులు, గుణగ్రహణపారీణులు అయిన శ్రీ పి. యస్. రాజ గోపాలరాజుగారు. శ్రీకార్యనిర్వహణ దక్షులైన వీరి అభిమాన ప్రోత్సాహాలే నన్ను ముందుకు నడిపించినవి. ఈ సన్నివేశమున నా భక్తిస్మరణలకు పాత్రులైనవారు గురువర్యులు శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు, ప్రొఫెసర్ జి. యస్. రెడ్డిగారు, గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు. వీరి ప్రసాద ప్రణయ సౌహార్దాలే నాపాలిటి మంగళాశాసనాలు.

ఈ సంపుటిలో అవతరించిన 54 సంకీర్తనలలో అధ్యాత్మ శృంగారములు రెండూ వున్నవి. పండిత పరిష్కృతములై వెలసిన సంకీర్తనల సంపుటముల నుండే వీనిని సేకరించినాను. ఈ పాటలు చాలవరకు నేటి సుప్రసిద్ధ గాయకులు గానంచేసి ప్రచారం చేస్తున్నవే. పాఠకులకు ఒకపాటి గ్రహణకోసం పాట పాటకు చిన్న అవతారికను చేర్చినాను. ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు రాజగోపాల రాజు :రి సూచన మేరకు అనుబంధంలో కొన్ని పదాలకు లఘుటీకలను కూడ సంతరించినాను. ఇందు నాకు ఉపకరించిన వ్యక్తుల, ఆకరముల పేర్లను పుటాక్షరములతో సూచించినాను. ఈ పాటల కూర్పులో పూజ్యులు రాళ్లపల్లి వారు స్వరపరచి, లఘుటీక చేర్చి ప్రకటించిన తాళ్లపాక పాటల సంపుటాలు రెండూ నాకు ఎంతో ఉపకరించినవి. ఆలిండియా రేడియో "వాణి" సౌజన్యంతో రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారి "అన్నమాచార్యుని కవిత" అనే వ్యాసము ను ఈ సంపుటిలో చేర్చినాను. పూజ్యులు శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మగారికి నా వినయపూర్వకమైన కృతజ్ఞతాంజలులు.

తాళ్లపాకవారి వాఙ్మయంపై బహుముఖమైన పరిశోధనలు సాగవలెనని తీవ్రముగ ఆకాంక్షించు దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు డాక్టర్ సి. అన్నారావుగారికి, కర్తవ్యదీక్షతో మావంటి వాళ్లను నిర్మాణాత్మకమైన ఇట్టి

కార్యములకు ప్రేరేపిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ పి.యస్. రాజగోపాలరాజు గారికి మావంటివారితో పాటు కళాప్రపంచమంతా ఋణపడివున్నది.

వర్ధంతి నాటికే ఈ సంపుటిని ఆవిష్కరించవలెనను అధికారుల తీర్మానమును ఫలవంతము చేసిన దీక్షాపరులు ప్రెస్ మేనేజర్ విజయకుమార్ రెడ్డి గారికి, ఇంత సొగసుగ, నిర్దుష్టంగ తయారుచేసిన ప్రెస్ సాంకేతిక సిబ్బందికి నా హార్దమైన ధన్యవాదములు.

ఈ ప్రతిని సిద్ధం చేయడంలో నాకు తోడ్పడిన ఆత్మీయమిత్రము చేట్లూరు శేషాద్రికి, అకారాది సూచికలు వ్రాసిపెట్టిన నా సహధర్మచారిణి చి॥ కుం॥ సౌ॥ రుక్మిణికి, అన్నమాచార్య పంక్తిరత్నాధ్యాయిని, మధురగాయని కుమారి ఆర్. జి. శోభారాజుకు భగవంతుడు శ్రీనివాసుని మంగళాశాసనాలు.

నా యీ భాగవతకైంకర్యమును సహృదయులైన కళారసికులందరు ఆదరించి మన్నిస్తారనే విశ్వాసం.

"నీ గుణము నే నెరిగి నిన్ను గొలువగ నేర
నాగుణము నీ వెరిగి నన్ను నేలుకోవయ్య"

అను అన్నముని పాటే నా మనసులోని మాట. ఇంతకంటె నేను మనవి చేయ గలిగిన దేమున్నది.

తిరుపతి,
29-3-1978.

కామిశెట్టి శ్రీనివాసులు శెట్టి

— —

# అన్నమాచార్యుని కవిత*

— రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

తెలుగు వాఙ్మయపు చరిత్రలో పదునైదవ క్రీస్తు శతాబ్దము ఒక ప్రధాన ఘట్టం. కవితాకన్యక ముగ్ధమై అసందిగ్ధమైన కౌమార వయోమాధుర్యమును మీరి, తొలిప్రాయపు తళుకులు, అందరినీ ఆకర్షించు బెళుకులు నేర్చుకొను కాలమిది. నిర్లక్ష్యపు నెరసులు, పలుకుల బిరుసులు నిండిన రచనలప్పటివి. భావములలో ప్రశాంతికంటే, నెమ్మదికంటే, ఆత్రమూ ఆవేగమూ ప్రబలంగా తోచిన వాతావరణ మది. కవులకు లోక కల్యాణానికంటే ఆత్మకల్యాణంలో ఆభినివేశ మెక్కువ; తపస్సుకంటే ధీరత్వం ప్రబలం. కనికరముకల ఆచారత్వాని కన్నా ఆగ్రహంతో నిండిన ఆచార్యపుంస్త్వం ఎక్కువ వ్యాపించిన జీవిత మప్పటి కవీశ్వరులది. పాల్కురికి సోముడు, నాచన సోముడు మొదలైన వారారాధించిన ఈ కవితామార్గము బమ్మెర పోతన్న, శ్రీనాథుడు, పినవీరభద్రుడు మొదలగు మహానుభావుల రచనలలో పండింది. తాళ్లపాక అన్నమాచార్యులు ఈ అగ్రగణ్య పంక్తికి చేరినవాడు.

ఒకవిధంగా చూస్తే ఆ పంక్తిలో ఇతడే అగ్రగణ్యుడనవచ్చును. తెలుగులో పదకవిత్వం రచించిన వారిలో ఇతనికంటే ప్రాచీనులు మనకు గోచరింపరు. గేయ కవిత మనుష్యులకు సహజమై పరమ ప్రాచీనమైన రచన. నిజమే. కనుక, ఇతర భాషలవలె తెలుగులోనూ అనాదిగా పాటలు రచించిన స్త్రీ పురుషులు ఎందరో ఉండి వుంటారనేదీ సంభావ్యమే కానీ, అవన్నీ కాలగర్భంలో మరుగునపడి పోయినవి. ఉన్నవాని కాలప్రమాణం మనకు తెలియదు. కృష్ణమాచార్యుని సింహగిరి వచనాలు అన్నమయ్యకు ముందే పుట్టినా, అవి గేయరచనలే ఐనా, అవి అంగాంగి విభాగం లేక అఖండ గద్యధారగా, గేయగంధులుగా మాత్రమే ఉన్నవి. ఆ గానగంధం కూడా మనదాకా రాక ఎప్పుడో

---

* వాణి సం. VII. సం. 5. 22-7-1955.

అంతరించింది. పదునైదవ శతాబ్దానికి కొంచెం ముందుగా కన్నడ భాషలో, ముఖ్యంగా వైష్ణవదాసుల రచనలలో పదం విత ఒక అచ్చు కట్టైన స్వరూపాన్ని సంపాదించుకొని విలిచింది. ప్రాచీన సంగీత లక్షణ గ్రంథాలు చూస్తే, ప్రబంధాలనబడే గేయరచనలు మనదేశంలో అసంఖ్యాకంగా ఉండేవనిన్నీ, రాగం, తాళం, శబ్దం, అర్థం, సందర్భం మొదలైన వాటిని బట్టి ఆ రచనల్లో ఎన్నో భేదంలేని విభాగాలు ఏర్పడి వుండేవనిన్నీ తెలియవస్తుంది. ఆ వాదస్త్రాలన్నీ వదిలిపెట్టి, సుప్రసిద్ధమైన దేశిరాగాలలో, సుగ్రహమైన లయ, తాళాలలో నిబంధించి సులభీకరించిన రచనలే పదాలు.

పదానికి రెండే అంగాలు, పల్లవి, చరణం. అర్థాన్నిబట్టి చూస్తే ముఖ్యమై కేంద్రభూతమైన అర్థం పల్లవిలో ఉంటుంది. దాని విస్తరణమే వివరణమే చరణంలో నిబంధింపబడుతుంది.

> 'ఎండగాని నీడగాని యేమైనగాని
> కొండలరాయడే మా కులదైవము'

అనేది పల్లవి. ఈ అర్థాన్నే వేరు వేరు శబ్దార్థాలతో పెంచి, పెద్దచేసి,

> 'తేలుగాని పాముగాని దేవపట్టయినగాని
> గాలిగాని ధూళిగాని కాని యేమైనా,
> కాలకూట విషమైన గక్కున మింగిన నాటి
> నీలవర్ణుడే మా నిజదైవము.'

అని రచించింది చరణం. పల్లవి భావం ఒక వాక్యంలో ముగియకపోతే రెండవవాక్యాన్ని అనుపల్లవిగా చేర్చి రచించేది కద్దు. 'తనకిర్మమెంత చేతయు నంతే' అనేది పల్లవైతే 'గొనకొన్న పని యెంత కూలీ నంతే' అనే రెండవ ఉపస్కారక వాక్యం అనుపల్లవిగా భావింపబడుతుంది. ఇష్టే ఒక చరణంలో చేసిన పల్లవి వాక్యార్థవిస్తరణం చాలదని తోచినప్పుడు అట్టివే మరికొన్ని చరణాలు చేర్చవచ్చును. ఆ కాలంలో

ప్రాయికంగా ఒకపదానికి మూడు చరణా లుండేవి. కడపటి చరణంలో కర్తముద్ర చేర్చేవారు. మరి సంగీత దృష్టిలో చూచినప్పుడు తాళలయాలు రెండూ ఆద్యంతం ఒకటే రీతిగా గోచరిస్తుంది. పల్లవిలో పొటమరించిన రాగభావం చరణంలో సర్వాంగీణంగా విస్తరింపబడి, కడపటి పల్లవి యెత్తుగడ నందుకొని లయించిపోతుంది. ఎన్ని చరణాలు రచించినా వాటి రాగస్వర సంచారక్రమం ఒకేతీరుగా ఉంటుంది. దీనికి విరుద్ధంగా ప్రతి చరణానికీ రాగతాళాలు వేరువేరుగా ఏర్పరచి చేసిన 'సూళాదులు' అనే పదాలు ఎన్నో 15-16 శతాబ్దాలలో కన్నడభాషలో పుట్టినవి. కాని అవి వ్యాప్తికి రాక అడుగున పడిపోయినవి. ఈ పదస్వరూపాన్ని రచనకై పరిగ్రహించిన తెలుగు బయకార్లలో ఇప్పటికి అన్నమాచార్యులే ప్రాచీనతముడుగా కానవస్తున్నాడు. పదకవితాపితామహుడని తరువాతి వారు అతని బిరుదు పేర్కొన్నారు. ఇతనికి తర్వాత కొంత కాలంలోనే ఆంధ్రకవితాపితమహ బిరుదాన్ని సంపాదించుకొన్న అల్లసాని పెద్దన్నగూడా ఇతని వలెనే నందవరీకనియోగి కావడం – ఇతని వలెనే శ్రీవైష్ణవమత స్వీకారం చేసినవాడు కావడం కొంత వింతగొలిపే సందర్భాలు.

పద్యరచనకూ, పదరచనకూ మూల ద్రవ్యమందే ఎంతో భేదమున్నది. పద్యాలది అక్షరచ్ఛందస్సైనా, మాత్రాచ్ఛందస్సైనా మొత్తం మీదనే తప్ప దాని భాగాలమీద కవికి దృష్టి వుండదు; ఉండ నక్కరలేదు. అక్షరసంఖ్యగాని మాత్రాగణ సంఖ్యగాని కచ్చితంగా వుంటే చాలును. మాటలుగాని, వాక్యాలుగాని భావానుసారంగా ఎక్కడనైనా తెంచిపెట్టవచ్చును; ఎంతదూరమైనా లాగవచ్చును. రాగం చేర్చుకొని పద్యాలు చదివే రుచిగలవారు ఏ అక్షరాన్నైనా అర్థం చెడకుండా వుంటే సరి – ఎంత పొడవుగానైనా సాగదీయవచ్చును. అంటే అందులో లయబంధం లేదన్న మాట. పదాలలో అట్లు చేసే వీలులేదు. ఇక్కడ ప్రధానమైనవి పాదాలు, పాదమధ్యాలు, వాటి అవాంతర ఖండాలు. మొత్తం తాళాన్నేకాక దాని ఖండాలనుగూడ ఆ యా జాతికి తగినట్లు

ఒత్తి చూపెట్టవలయును. స్వరానికి శ్రుతి యెంత ముఖ్యమో, తాళానికి లయ అంతే ముఖ్యం. కనుక తాళము యొక్క ఆదిమధ్యాంతాలు కలిసి వెనుకముందులు కాకుండా సాహిత్యాన్ని పదంలో నడపవలసివుంటుంది. ఆ విభాగాలను వినేవారికి స్పష్టంగా అందిచ్చేపని యతిప్రాసలది. తెలుగు పద్య రచనలలోను యతిప్రాసలున్నా అవి ఉన్నవనిపిస్తే చాలునని లాక్షణికులు ఉదారంగా తృప్తిపడతారు. అట్లు తృప్తిపడక లయ నిర్బంధం చేస్తే ఏ కవీ గట్టెక్కలేడు. ఏ కథను గాని, ఏ దీర్ఘభావాన్ని గాని ఛందస్సులో పొదిగించలేడు. పదకవిత్వంలో అట్లాగాక తాళలయాలు ప్రబలమై యతిప్రాసలను స్పష్టంగా చూపి, ఆయా చోట్ల పదాలే కాక వాక్యాలుగూడ కత్తిరించి, పూర్వోత్తర ఖండాలను పొందికను సామరస్యాన్ని ఎత్తిచూపవలసివుంటాడు రచయిత. కనుక, 'పెంపేదం దమకట్టి తక్కువలు రూపింపంగనేలా, విచారింపన్ వారిక మేలుసంధి, తమువారిం జూచి నేఁ దారు సాధింప జాలరో కాక పోరఁదగ మర్దింపం దలంపేని శంకింపం బట్టొకో వారు బ్రాహ్మణులె యే కీడైన సైరింపంగఁ' అని పద్యం ఈడ్చినట్లు ధారాళశైలిలో పదం రచింప వీలులేదు. మరి

కలలోని సుఖమైన - కలియుగమా, వెన్న
కలిలో నెక్కడిదె - కలియుగమా
కడిగడ గండమై కాలము గడపేవు
కడుగ కడుగ రొంపి - కలియుగమా
బడలిక వాపవు - పరమేదో చూపవు
గడిచేటి మును నీవు - కలియుగమా.

అన్న రీతిగా శబ్ద వాక్యాలు అమర్చవలసి వుంటుంది పదంలో. కనుక పద్యరచనకూ, పదరచనకూ ప్రమేయంలో కొంత భేద ముండక తప్పదు. దాని ఫలంగా మన దృష్టికూడా భిన్నంగా ఉండవలసింది విధి; అధిక పదములు పునరుక్తులు మొదలైన వాటిని పద్యంలో నిరసించినంత తీవ్రంగా పదంలో నిరసించరాదు. స్వతంత్రమైన ధారాళత

గల పద్యరచనలో అర్థభావాలకు కవి చూపగలిగినంత అఖండత, వైశాల్యం, సూక్ష్మత, వైవిధ్యం మొదలైన గుణాలు పదరచనలో చూప లేదు. మరి రాగతాళాలు, సూత్రాలు బొమ్మనాడించినట్లు, అర్థభావ భావనలను పట్టి చూప గలిగిన పదరచనలో ఉన్నంత వర్చస్సు, శక్తి, ఆకర్షణ పద్యరచనలోరాదు. ఈ రెండు రకాల రచనల ననుభవించ డంలో ఈ దృష్టిభేదం చాలా ముఖ్యం.

మరి అన్నమయ్య తన జీవిత మందలి తపస్సుకు మూల ద్రవ్యంగా పదకవితను పరిగ్రహించినాడు. సంస్కారసిద్ధమై సహజమైన కవితాశిల్పం, ఎప్పుడూ పదను చెడని భావనాశక్తి కలవాడు. స్వతః ఉద్రిక్తమై భావవేగాలను అణచుకోలేని ప్రకృతి. దాన్ని సర్వాత్మనా శ్రీవేంకటేశ్వరుని కర్పణం చేసినవాడు. వేంకటేశ్వరుడే పరమ తత్త్వమనే నిశ్చంచలమైన గట్టినమ్మిక ఎవరి పుణ్యాననో ఇతనికి లభించింది. ఆ మూర్తినే ఆధిభౌతికమైన, ఆధ్యాత్మికమైన సర్వ ప్రపంచం లోనూ అంతర్యామిగా, బహిర్యామిగా భావించి, పూజించి, ప్రేమించి, కలహించి, ప్రాధేయపడి, ప్రార్థించి, పొగడి, తెగడి, అనుభవించి, ఏకీభవించి జీవితంలోని అంతరంగ బహిరంగ పరమాణువు లన్నిటా అతని బ్రతుకే బ్రతికినవాడు. ఆ అనుభవాలన్నీ మానసికంగా, కాయికంగా మాత్రమే కాక, వాచికంగా కూడా అనుభవించినవాడు. ఆ వాచికానుభవాలే ఆయన పదకవితలు.

ఆ కాలపు కావ్యప్రపంచమే ఉద్రేక ప్రధానమై, స్వతంత్ర ప్రీతి కలదని చెప్పితిని. మనస్సుకు నచ్చిన భావాన్నిగాని, అది రూపుగొన్న భాషాశయ్యారేఖలను గాని ఒకటి రెండు సార్లయినా నెమరువేసి సవరించి తీర్చిపెట్టే క్షమ అప్పటి కవులకు చాలదనిపించకపోదు. పాల్కురికి సోముని నిష్కళంక శివభక్తి, పోతనామాత్యుని కరగి కరగించే కృష్ణప్రేమ, శ్రీనాథుని సర్వంకషమైన రసభావముల చొరవ ఇవన్నీ ఆకర్తలింక కొంత ప్రశాంత హృదయంతో మననం చేసి రచించి వుంటే

ఎంత అలౌకికంగా, అనిర్వచనీయంగా ఉండేవో అనే కొదవ నామట్టుకు నాకు పలుమారు కలుగుతూ వుంటుంది. ఆ వీధులలోనే తిరిగి తేరిన అన్నమయ్య రచనలోనూ ఆ ధర్మాలు కానిపింపక మానవు. అందందు పదపాదపూర్తికి మాత్రమే పనికివచ్చే భావాలు, యతిప్రాసలకై తెచ్చి మెత్తిన తేపమాటలు, ఆక్రోశంతో ఆలోచన కవకాశ మీయక చెప్పిన అభిప్రాయాలు ఇతని పదాలలో లేకపోలేదు. కాని, యితని కవిత విషయప్రధానము కాక విషయి ప్రధానమైనది. అంటే: ఇతర వ్యక్తుల కంటె, వారి అనుభవాలకంటె తన అంతరంగ బహిరంగానుభవాలనే ముఖ్యంగా వెలువరించేది. ఇట్టి విషయి రచనకు వర్చస్సునిచ్చే గుణం ఆర్జవం. ఆర్జవం అంటే తాను అనుభవించిన భావాలనే వెలువరించే అకృత్రిమ స్వభావం. ఇతరుల మెప్పులకో సంప్రదాయ సంరక్షణకో ఆశపడి తన మనస్సులో నిజంగా లేని భావాలను ఆరోపించుకొని రచనా వ్యాపారం సాగించే సంత పని కాదు. ఆ ఆర్జవగుణమే వ్యవహారం లోనూ, కవితలోనూ భావాలకు తీవ్రతను, భాషకు పదునైన తీర్పును ఈయగలిగేది. ఆ ఋజుత్వమే జీవధర్మంగా బ్రతికినవాడు అన్నమయ్య. తన్ను సర్వవిధముల గౌరవించి పూజించిన ప్రభువు సాళ్వనరసింగ రాయడు తనమీద ఒక్కపదం రచించిపెట్టమని వేడగా "హరి ముకుందుని గొనియాడు నా జిహ్వ నినుగొనియాడంగ నేరదెంతైన-నను నెట్లు పలికితీ నైచ్యంపుఁబలుకు?" అని తిరస్కరించి సంకెళ్లతో చెరసాల అనుభవించినవాడు. ఆ నిష్కల్మష భగవద్భక్తి బలం చేతనే ఆ సంకెళ్ళను తెంచుకొని బైటబడినవాడు.

కనుక అన్నమాచార్యుల పదకవితలో మనలను సంక్రమించి పరవశపరిచే భావబలం, భాషతీర్పు, అనుభవాల లోతు, వైవిధ్యం-ఇంకే పదకవి రచనలోనూ కానరాదు.

పాపినైన నాపాలగలిగి త్రోవ-
చూపుమన్న నెందుఁజూపరు.

ధృతి దూలి జగమెల్లఁదిరిగి వేసరితి
ఇతరాయముల శేగి వేసరితి
గతిమాలి పరులపైఁ గనలి వేసరితి
మతిమాలి కులవిద్య మాని వేసరితి

విసిగి యాచారంబు విడిచి వేసరితి
పసచెడి ప్రియములు పలికి వేసరితి
కొసరి ద్రవ్యంబుపైఁ గోరి వేసరితి
కసుగంది లోలోనె కాఁగి వేసరితి

కోవిదులగువారిఁ గొలిచి వేసరితి
దైవము లందరిఁ దగిలి వేసరితి
శ్రీవెంకటేశుని సేవమాని వట్టి
సేవలన్నియును సేఁతేసి వేసరితి

ఈ పదం రచించినవాని హృదయంలో ఎక్కడనైనా కృత్రిమత్వం కలదని యెవరు చెప్పగలరు? అధ్యాత్మ శ్రద్ధ దృఢంగా కలవారి ఆధిభౌతిక జీవితంలో ఈ రెండు తత్వాలకూ కల పరస్పర విరోధం తెంచరాని చిక్కు. ఈ పోరాటంలో చిక్కి నలిగేవారికి ఎన్నివిధాల ఆశ, నిరాశ, నమ్మకం, సందేహం, తృప్తి, వేసట, కోపం, దీనత, దుఃఖం, ఆనందం మొదలైన భావాలు కలుగునో అవన్నీ అన్నమాచార్యుల పదాలలో స్థిరంగా ప్రతిఫలించి ఉన్నవి

ఆధిభౌతికానుభవములలో అన్నమాచార్యులు ఎక్కువగా భావించింది శృంగారం. దాన్నిగూడా ఆధ్యాత్మికపు మట్టాని కెక్కించిన మహాపురుషుడాయన. ఆయన రచించిన శృంగారపదాలు ఒక విశాల విశ్వం వంటివి. వాటి అసాధారణ సౌందర్యం ప్రత్యేకంగా చర్చించవలసింది. ఈ పదమొక్కటి గమనిస్తే తరువాతి శృంగార కవులకన్న అతడెంత ఎత్తులో నున్నాడో గ్రహింపగలము. ఇదొక విరహిణి యవస్థ. చెలికత్తెమాట:

నిన్ను వ్రాసిన యట్లు నెలతకు వియోగదశ
లెన్నడను దోప విదియేమొ కాని

నినుదలచి లలితాంగి నీ రూపమాత్మలో
గని నీవు నవి బయలు కౌగలించినది
తనర నాకాశ తత్త్వము నీ మహాత్త్వమని
వనిత యెవ్వరి చేత వినెనో కాని

నిను బొగడి నీరూపు కనుకోయి కెదురైన
తనివి దీరక బయలు తగ జూడ దొడగె
మునుకొన్న సర్వతోముఖుడ వనగా నిన్ను
వెనకకే భావమున వినెనో కాని

తలపునను వాక్కునను తలపదలపగ నీవు
కలసి యా కమలాక్షిఁ గౌగిలించితివి
తెలిసితిమి వేంకటాధిపతి నీ పిన్నింట
గలవనెడిమాట నిక్కంబులో కాని.

ఇట్లే శ్రీవేంకటేశ్వరుని డోలావిహారం, గుర్రపుస్వారీ, గరుడయాత్ర మొదలైన ఆటలన్నిటినీ వట్టి వినోదాలుగాక విశ్వలీలావిహారాలుగా కలిపి చిత్రించి అనుభవించినా దన్నమయ్య. మనం అనుభవించితే ధన్యుల మౌతాము. ఈ పదాలు పాడుకోగలిగితే సరే. పాడలేనివాటికినీ, పద్యాలుగా చదువుకొని ఆనందింప గలిగినంత స్వతంత్రమైన అర్థభావ రచనల అందచందాల నిండిన నిధులివి.

(' వాణి ' సౌజన్యంతో)

---

# సంకీర్తనల గానం

— రాళ్లపల్లివారి అభిప్రాయం

"ఈ పాటలకు రేకులలో పేర్కొనబడిన రాగము లన్నియు ఇంచు మించు ప్రాతబడి నవ్యతను గోల్పోయినవనియు, కనుక ఇప్పుడు జనప్రియమైన క్రొత్త క్రొత్త రాగములలో పోకడలలో వీనిని పొదిగించిననే తప్ప లోకులు వీని నాదరింపరనియు పలువురికి సందేహ మున్నది. కొంతనిజమే. కాని రాగముల రక్తికి వాని స్వరూపమున కంటె పాడునట్టి కళావంతుని ఆధ్యాత్మిక చిత్తవృత్తి ముఖ్యకారణ మని నా యనుభవము. ఏ రాగమందు రచించిన యే కృతినైనను మఱి యే రాగమందైనను పాడవచ్చుననుట సామాన్య సంగీత విద్యార్థులు గూడ ఎఱిగిన విషయమే. కనుక రాగభేదము చేత రక్తి కలుగుననుట చాలా స్థూలమైన అభిప్రాయము. మఱియు నేటి క్రొత్త రేపటికి ప్రాతగా మారక తీరదు. ఇంతేకాదు. కర్తయుపయోగించిన పద ములు భావములును ప్రాతపడినట్లు మనకు తోచవచ్చునుగదా. అప్పుడు వానినిగూడ మనరుచికి దగినట్లు మార్చుటకు పూనుకొంటి మేని మన నవ్యప్రియత్వపు దెబ్బకే ప్రాచీన మహాకవియును తట్టు కోలేడు! కనుక కళోపాసకు లుపయోగించిన పరికరముల యంత స్తును మీఱి లోతుకు దిగి వారి యాధ్యాత్మిక వృత్తులను గ్రహించి యనుభవించుటయే కళారసికుల ప్రయత్నము గావలయును.... .... తాళ్లపాకవారి రచనలు అర్థభావ ప్రధానములైనవి. త్యాగరాజ దీక్షితాదులవానివలె నాదరచనా ప్రధానములు గావు. కనుక గాయ కులు ఆ దృష్టితో సాధించి పాడిరేని తప్పక సభ్యుల నాకర్షింపగల రని నా నమ్మిక .... ...."

[ తాళ్ళపాక పాటలు Vol. I ఉపోద్ఘాతము పు. 12–14 ]

# 1

[ఈ పాట 'పరుషల' హృదయాలు పల్లవించి ఫలించినది. 'ఆపదమొక్కులవాడా గోవింద. వడ్డికాసులవాడ గోవింద' అని నేటికి యాత్రికులు కొండ ఎక్కుతూ పలుకుతూ పాడుతూ వుంటారు. వరాలనిచ్చే వరాల వేలుపు అలమేలు మంగా వల్లభుడే. వేంకటనాథుడే.]

పల్లవి :

వేడుకొందామా వెంకటగిరి వెంకటేశ్వరుని

చరణాలు :

ఆమటి మ్రొక్కుల వాఁడే ఆదిదేవుఁడే వాఁడు
తోమని పళ్యాల వాఁడే దురితదూరుఁడే

వడ్డికాసులవాఁడే వనజనాభుఁడే పుట్టు
గొడ్డురాండ్రకు బిడ్డలిచ్చే గోవిందుఁడే

ఎలమిఁగోరిన వరాలిచ్చే దేవుఁడే వాఁడు
అలమేల్మంగా శ్రీవెంకటాద్రినాథుఁడే

# 2

[కొండలలో కోనేటి తటంలో వెలసిన వేంకటాచలపతి ఎందరో మహాభాగవతోత్తముల మ్రొక్కులందినవాడు. శరణు జొచ్చిన మహాభక్తులను తన దయాభిక్షతో అనుగ్రహించినవాడు. ఆ భాగవతోత్తముల బ్రతుకులు తిరుమల స్వామితో పెనవేసుకొన్నవి.]

## సామంతం

పల్లవి :

కొండలలో నెలకొన్న కోనేటిరాయఁడు, వాఁడు
కొండలంత వరములు గుప్పెడు వాఁడు

చరణాలు :

కుమ్మరదాసుఁడైన కురువరతినంబి
యిమ్మన్న వరములెల్ల నిచ్చిన వాఁడు
దొమ్ములు సేసినయట్టి తొండమాంజక్కురవర్తి
రమ్మన్న చోటికి వచ్చి నమ్మినవాఁడు

అచ్చపు వేడుకతోడ ననంతాళువారికి
ముచ్చిలి వెట్టికి మన్ను మోఁచినవాఁడు
మచ్చిక దొలఁకఁ దిరుమలనంబి తోడుత
నిచ్చనిచ్చ మాటలాడి నొచ్చినవాఁడు

కంచిలోన నుండఁ దిరుకచ్చినంబి మీఁదఁ గరు
ణించి తన యెడకు రప్పించిన వాఁడు
యెంచి నెక్కుడైన వేంకటేశుఁడు మనలకు
మంచివాఁడై కరుణఁ బాలించినవాఁడు

# 3

[ వేంకటేశ్వరుని ప్రణయం, అనురాగం, వైభవం ఆర్తత్రాణ పరాయణత్వం చాటిచెప్పే సంస్కృత సంకీర్తన ]

## శ్రీరాగం

పల్లవి :

వందే వాసుదేవం
బృందారకాధీశ వందితపదాబ్జం

చరణాలు :

ఇందీవరశ్యామ మిందిరాకుచతటీ
చందనాంకిత లసచ్చారుదేహమ్
మందారమాలికా మకుటసంశోభితం
కందర్పజనక మరవిందనాభమ్

ధగధగిత కౌస్తుభాధరణవక్షస్స్థలం
ఖగరాజవాహనం కమలనయనమ్
నిగమాధిసేవితం నిజరూపశేషప
న్నగరాజశాయినాం ఘననివాసమ్

కరిపురనాథ సంరక్షణే తత్పరం
కరిరాజవరద సంగత కరాబ్జమ్
సరసీరుహాననం చక్రవిభ్రాజితం
తిరువేంకటాచలాదేవం భజే

# 4

[ఇది లక్ష్మీనృసింహుని ఉగ్రరూపమును వర్ణించే సంకీర్తన పంచభూతాత్మకమైన శరీరమునకు కర్త-కారణము భగవంతుడే. ఫలము, ప్రాప్తి ఆతని చేతులలోనివే. నరసింహుని నొసలికన్ను వైరిదానవ వంశాలను భస్మము చేయునది. తాళ్లపాక కవులకు అహోబిల నృసింహుడు ఇష్టదైవము. తిరుమల మందిరంలో యోగనృసింహునకు ప్రత్యేకంగ గుడి ఉన్నది.]

## శ్రీరాగం

పల్లవి :

ఫాలనేత్రానలప్రబల విద్యుల్లతా
కేలీవిహార లక్ష్మీనారసింహా

చరణాలు :

ప్రళయ మారుత ఘోరభస్త్రికాపూత్కార
లలిత నిశ్వాసడోలారచనయా
కులశైలకుంభినీ కుముదహితరవిగగన
చలన విధినిపుణ నిశ్చలనారసింహా

వివరఘనవదన దుర్విధహసననిష్ఠ్యూత
లవదివ్యపరుష లాలాఘటనయా
వివిధజంతువ్రాతభువనమగ్నీకరణ
నవనవప్రియగుణార్ణవ నారసింహా

దారుణోజ్జ్వల ధగద్ధగితదంష్ట్రానల వి
కార స్ఫులింగ సంగక్రీడయా
వైరిదానవ ఘోరవంశ భస్మీకరణ
కారణప్రకట వేంకటనారసింహా

# 5

[వేంకటేశ్వరుని భక్తసంరక్షకమూర్తి తరతరాల భిన్నవిభిన్న మానవ విశ్వాసాలకు కూడలిగ నిలిచినది. ఈ పరమవైష్ణవ క్షేత్రంలో శైవులు, శాక్తేయులు కూడ వాసం చేసినట్లు చారిత్రకమైన ఆధారాలున్నాయి. శివకేశవ భేదవైషమ్యాలు అల్పబుద్ధులకే.]

బౌళి

పల్లవి :

ఎంత మాత్రమున నెవ్వరు దలఁచిన అంతమాత్రమే నీవు
అంతరాంతరము లెంచి చూడఁ బిండంతే నిప్పటి యన్నట్లు

చరణాలు :

కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుఁడని
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మంబనుచు
తలఁతురు మిము శైవులు తగినభక్తులను శివుఁడనుచు
అలరి పొగడుదురు కాపాలికులు ఆదిభైరవుఁడనుచు

సరి నెన్నుదురు శాక్తేయులు శక్తిరూపు నీవనుచు
దరిశనములు మిము నానావిధులను తలఁపుల కొలఁదుల భజింతురు
సిరుల మిమ్ము నే యల్పబుద్ధిఁదలచినవారికి నల్పం బవుదువు
గరిమల మిమునే ఘనమని తలఁచిన ఘనబుద్ధులకు ఘనుఁడవు

నీవలనఁ గొరతే లేదు మరి నీరుకొలఁది తామెరవు
ఆవల భాగిరథిదరి బావుల ఆ జలమే వూరినయట్లు
శ్రీవేంకటపతి నీవైతే మముఁ జేకొని వున్నదైవమని
యీవల నే నీ శరణనియెదను యిదియే పరతత్త్వము నాకు

# 6

[ వేంకటేశ్వరుని దివ్యపాదమును ఉల్లేఖించడం ఇందలి వస్తువు. ప్రణయంతో, భక్తితో, ఆర్తితో, ఎందరో మహాభక్తులు భగవంతుని శ్రీపాదములను స్పృశించినవారే. ఇది బ్రహ్మ కడిగిన పాదము. గంగ పుట్టిన పాదము. గజేంద్రుని కాపాడిన పాదము. అహల్య పాపమును కడిగిన పాదము. వేంకటాద్రిపై నిలిచిన ఈ పాదము ఇహపరములను ప్రసాదించేది. ]

శ్రీరాగం

పల్లవి :

ఈ పాదమే కదా యిల యెల్లఁగొలిచినది
యీ పాదమే కదా యిందిరా హస్తముల కితవైనది

చరణాలు :

ఈ పాదమే కదా యిందఱును మ్రొక్కెడిది
యీపాదమే కదా యీ గగనగంగ పుట్టినది
యీపాదమే కదా యెలమిఁ బెంపొందినది
యీపాదమే కదా యిన్నిటికి నెక్కుడైనది

ఈపాదమే కదా యిభరాజు దలఁచినది
యీపాదమే కదా యింద్రాదు లెల్ల వెదకినది
యీపాదమే కదా యీబ్రహ్మ గడిగినది
యీపాదమే కదా యెగసి బ్రహ్మండ మంటినది

ఈపాదమే కదా యిహపరము లొసగెడిది
యీపాదమే కదా యిల నహల్యకుఁగోరికైనది
యీపాదమే కదా యీక్షింప దుర్లభము
యీపాదమే కదా యీవేంకటాద్రిపై నిరవైనది

# 7

[రామకథ అంతా ఈపాటలో పలికింది. శ్రీరామజననం నుండి పట్టాభిషేకం దాకా కథంతా సాగింది. అన్నముని ద్విపద రామాయణం దక్కక పోయినా సంకీర్తనాత్మకమైన రామకథా సన్నివేశాలు మాత్రం దొరకినవి.]

## బౌళిరామక్రియ

పల్లవి :

ఇతఁడే పరబ్రహ్మ మిదియె రామకథ
శతకోటి విస్తరము సర్వపుణ్యఫలము

చరణాలు :

ధరలో రాముఁడు పుట్టె ధరణిజఁ బెండ్లాడె
అరణ్యవాసుల కెల్లా నభయ మిచ్చె
సొరిది ముక్కుఁజెవులు చుప్పనాతిని గోసె
ఖరదూషణులను ఖండించి వేసె

కినిసి వాలిఁజంపి కిష్కింధ సుగ్రీవు కిచ్చె
వనధి బంధించి దాఁటె వానరులతో
కనలి రావణ కుంభకర్ణాదులను జంపి
వనితఁజేకొని మళ్లి వచ్చె నయోధ్యకును

సౌమిత్రియు భరతుఁడు శత్రుఘ్నుఁడుఁ గొలువఁగ
భూమి యేలె కుశలవ పుత్రులఁగాంచె
శ్రీమంతుఁడై నిలిచె శ్రీవేంకటాద్రి మీఁద
కామించి విభీషణు లంకకుఁబట్టము గట్టె

# 8

[ తాళ్లపాకవారి సంకీర్తనల్లో హనుమంతుని ప్రశంస ఎక్కువగా కనిపిస్తుంది. ఇది కలశాపురంలో వెలసిన హనుమంతుని గురించి చెప్పినది. ]

## సాళంగనాట

పల్లవి :

శరణు శరణు వేదశాస్త్రనిపుణ నీకు
అరుదైన రామకార్యధురంధరా

చరణాలు :

హనుమంతరాయ అంజనాతనయా
ఘనవాయుసుత దివ్యకామరూప
అనుపమలంకాదహన వార్ధిలంఘన
జనసురనుత కలశాపురనివాస

రవితనయసచివ రావణవనాపహార
పవనవేగబలాఢ్య భక్తసులభ
భువన పూర్ణదేహ బుద్ధివిశారద
జవసత్వవేగ కలశాపురనివాస

సీతాశోకనాశన సంజీవశైలాకర్షణ
అతతప్రతాపశౌర్య అసురాంతక
కౌతుక శ్రీవెంకటేశు కరుణాసమేత
శాతకుంభవర్ణ కలశాపురనివాస

# 9

[ తిరుమలప్రభువు స్నానమాడేవేళ. అంతా సార్వభౌమోచితం గానే సాగింది. బ్రహ్మేంద్రాదులు స్వామికి ఉపచారములు చేసినారు. ఈ మహాభక్తుని హెచ్చరికలు సహస్రముఖములుగనే సాగినవి. ]

## ధన్నాసి

పల్లవి :

సందడి విడువుము సాసముఖా
మందరధరునకు మజ్జనవేళా

చరణాలు :

అమరాధిపు లిడుఁ డాలవట్టములు
కమలజ పట్టుము కాళాంజి
జమళి చామరలు చంద్రుఁడ సూర్యుఁడ
అమర నిడుఁడు పరమాత్మునకు

అణిమాది సిరుల నలరెడు శేషుఁడ
మణిపాదుక లిడు మతి చెలఁగా
ప్రణుతింపు కదిసి భారతిరమణ
గుణాధిపు మరుగురుఁ బలుమరును

వేదఘోషణము విడువక సేయుఁడు
ఆదిమునులు నిత్యాధికులు
శ్రీదేవుండగు శ్రీవేంకటపతి
ఆదరమున సిరు లందీ వాఁడె.

# 10

[ఇది లక్ష్మీవేంకటేశ్వరుల పెండ్లిసందడి. దిక్కుదిక్కుల పేరంటాలను అక్షంతలిచ్చి పిలిచినాడు. దేవతలను పిలిచినాడు మునులను పిలిచినాడు. యాత్రికులనూ పిలిచినాడు. అలమేలు మంగా వేంకటపతుల కల్యాణమునకు తానే పెద్దరికమును పూనినాడు. స్వామికి కల్యాణోత్సవమును అన్నమాచార్యుడే తొలుత ప్రారంభించినాడట.]

## సామంతం

పల్లవి :

పసిండి యక్షంత లివె పట్టరో వేగమే రారో
దెసలఁ బేరటాండ్లు దేవుని పెండ్లికిని.

చరణాలు :

శ్రీవెంకటేశ్వరునికి శ్రీమహాలక్ష్మికి
దైవికపుఁబెండ్లిముహూర్తము నేఁడు
కావించి భేరులు మ్రోసె గరుడధ్వజం బెక్కె
దేవతలు రారో దేవునిపెండ్లికిని

కందర్పజనకునికిఁ గమలాదేవికిఁ బెండ్లి
పందిలి లోపలఁ దలఁబాలు నేఁడు
గందమూ విడె మిచ్చేరు కలువడాలు గట్టిరి
అందుక మునులు రారో హరిపెండ్లికిని

అదె శ్రీవెంకటపతి కలమేలుమంగకును
మొదలి తిరునాళ్లకు మొక్కేము నేఁడు
యెదుట నేఁగేరు వీరె యిచ్చేరు వరము లివె
కదలి రారో పరుష ఘనులపెండ్లికిని.

# 11

[స్వామి పుష్కరిణి పరమ పవిత్రమైనది. అఖండవైభవాలకు నిలయమైంది. వేంకటేశ్వరుడు ఉభయనాంచారులతో ఈ పుష్కరిణీ జలాలలోనే తెప్పలలో తేలాడునది. తిరుమలలో "తెప్పోత్సవం" భక్తజనాకర్షకమైనది.]

## గుండక్రియ

పల్లవి :

దేవునికి దేవికిని తెప్పల కోనేటమ్మ
వేవేలు మొక్కులు లోకపావని నీకమ్మా

చరణాలు :

ధర్మార్థకామమోక్షతతులు నీ సోబనాలు
అర్మిలి నాలుగు వేదాలదె నీదరులు
నిర్మలపు నీజలము నిండు సప్తసాగరాలు
కూర్మము నీలోఁతు వో కోనేరమ్మా

తగిన గంగాది తీర్థములు నీకడళ్లు
జగతి దేవతలు నీ జలజంతులు
గగనపుఁ బుణ్యలోకాలు నీదరిమేడలు
మొగి నీచుట్టుమాఁకులు మునులోయమ్మా

వైకుంఠనగరము వాకిలే నీ యాకారము
చేకొను పుణ్యములే నీ జీవభావము
యేకడను శ్రీవేంకటేశుఁడే నీవునికి
దీకొని నీతీర్థ మాడితిమె కావవమ్మా,

# 12

["తిరుమల శ్రీనివాసుని బ్రహ్మోత్సవమున గరుడవాహనోత్సవము చాలా భక్తాకర్షకము: అతని విశ్వవిజయలీలకు గుర్తు. ఈ సంకీర్తన ఆ ప్రతాపవిలాసములను వివరించును. ఆ విజయ యాత్ర రాక్షసులను ధ్వంసము చేయుటకే యైనను ఇతరజగత్తు కూడ ఆ రౌద్రదశ ననుభవించినది." (రా.అ.కృ.శర్మ)]

నాట

పల్లవి :

ఇటు గరుడని నీ వెక్కినను
పటపట దిక్కులు బగ్గనఁగిలె

చరణాలు :

ఎగసిన గరుడని యేపున ధాయని
జిగి దొలఁక చబుకు చేసినను
నిగమాంతంబులు నిగమసంఘములు
గగనము జగములు గడగడ వడఁకె

బిరుసుగ గరుడని పేరెము దోలుచు
బెరసి నీవు గోపించినను
సరుస నఖిలములు జర్జరితములై
తిరుపున నలుగడ దిరదిరఁ దిరిగె

పల్లించిన నీ పసిఁడి గరుడనిని
కెల్లున నీ వెక్కిన యపుడు
ఝల్లనె రాక్షససమితి నీ మహిమ
వెల్లి మునుఁగుదురు వెంకటరమణా.

# 13

[ఇది స్వామి రథోత్సవం. దేవదేవోత్తముని తిరుతేరు ముందట అమరాంగనలు ఆడుతూ పాడుతూ సాగినారు. అలమేలు మంగతో కూడి స్వామి లోకసంరక్షణార్థం బంగారు తేరుపై ఊరేగినాడు.]

## దేవగాంధారి

పల్లవి :

అమరాంగన లదె యాడేరు
ప్రమదంబున నదె పాడేరు

చరణాలు :

గరుడవాహనుఁడు కనకరథముపై
యిరువుగ వీధుల నేఁగీని
సురలును మునులును సొంపుగ మోఁకులు
తెరలిచి తెరలిచి తీసేరు

యిలధరుఁడదివో యింద్రరథముపై
కెలయుచు దిక్కులు గెలిచీని
బలు శేషాదులు బ్రహ్మశివాదులు
చెలఁగి సేవలటు సేసేరు

అలమేల్మంగతొ నటు శ్రీవెంకట
నిలయుఁ దరదమున నెగడీని
నలుగడ ముక్తులు నారదాదులును
పొలుపు మిగులఁగడుఁ బొగడేరు.

# 14

[బాలకృష్ణుని చేష్టలు మధురముగ్ధప్రబంధాలు. వానిని ఏమీ అన లేము. ఏమి అనగలము? అవి అన విన శక్యం కానివి. అవి మన ఊహల కందని విచిత్రాలు. అవి కృష్ణమాయలు. అవి దినదిన క్రొత్తలు.]

## దేసాక్షి

పల్లవి :

అనరాదు వినరాదు ఆతని మాయలు నేఁడు
దినదిన క్రొత్తలాయ ద్రిష్టమిదే మాకు

చరణాలు :

ఆడెడి బాలుల హరి అంగిలి చూపుమని
తోడనే వాండ్ల నోర దుమ్ములు చల్లి
యీడ మాతోఁజెప్పఁగాను యిందరముఁ గూడిపోయి
చూడఁబోతే పంచదారై చోద్యమాయనమ్మా

తీఁట తీగెలు సొమ్ముంటా దేహము నిండాఁగట్టి
తీఁటకుఁగాక బాలులు తెగి వాపోఁగా
పాటించి యీసుద్ది విని పారితెంచి చూచితేను
కోటి కోటి సొమ్ములాయ కొత్తలో యమ్మా

కాకిజున్ను జున్ను లంటా గంపెఁడేసి తినిపించి
వాకొలిపి బాలులెల్ల వాపోవఁగా
ఆకడ శ్రీవెంకటేశుఁడా బాలుల కంటి నీరు
జోకగ ముత్యాలు సేసెఁ జూడఁగానే నేము.

# 15

[అన్నముని దేవతార్చన విగ్రహాలు ఎవరో దొంగిలించినారు. భక్తుని హృదయం అంతులేని పరితాపవేదనలకు గురైనది. అందుకే ఈ భగవంతుడు మహాభాగవతోత్తములను ప్రార్థించినాడు. ఆంజనేయుని, గరుత్మంతుని ప్రహ్లాదుని, అర్జునుని, ఆదిశేషుని, కార్తవీర్యార్జునుని పేరపేర పిలిచి వాపోయినాడు. పాపం సంకీర్తనాచార్యునకు ఆ విగ్రహములు దక్కినవో లేవో.]

బౌళి

పల్లవి :

ఇందిరారమణుఁ దెచ్చి యియ్యరో మా కిటువలె
పొంది యీతనిఁ బూజించఁ బొద్దాయ నిపుడు

చరణాలు :

ధారుణి మైరావణు దండించి రాముఁదెచ్చి
నేరుపున మించిన యంజనీతనయా
ఘోర నాగపాశములఁ గొట్టివేసి యీతని
కారుణ్య మందినట్టి ఖగరాజ గరుడా

నానాదేవతలకు నరసింహుఁ గంభములో
పానిపట్టి చూపినట్టి ప్రహ్లాదుఁడా
మానవుఁడై (డౌ?) కృష్ణమహిమల విశ్వరూపు
పూని బండి నుంచుకొన్న పోటుబంట యర్జునా

శ్రీవల్లభునకు నశేష కైంకర్యముల
శ్రీవేంకటాద్రిపైన శేషమూరితీ
కైవసమైనయట్టి కార్తవీర్యార్జునుఁడా యీ
దేవుని నీవేళ నిట్టె తెచ్చి మాకు నియ్యరే.

# 16

[ మేము హరిదాసులము. లక్ష్మీదేవి మాతల్లి. మాధవుడు మేము నమ్మి కొలచిన దైవం. మాకు పరులతో, ఒరుల సిరులతో పనియేమి. వేంకటేశ్వరుదే మాకు సకల భోగాలను సమ కూర్చినాడు-ఇది తాళ్లపాక కవుల ఆత్మ విశ్వాసం. ]

పాడి

పల్లవి :

పుట్టు భోగులము నేము భువి హరిదాసులము
నట్టనడిమి దొరలు నాకియ్యవలెనా

చరణాలు :

పల్లకీలు నందలాలు పడివాగె తేజీలు
వెల్లవిరి మహాలక్ష్మీ విలాసములు
తల్లి యాకె మగనినే దైవమని కొలిచేము
వొల్లఁగే మాకే సిరులు వొరులియ్యవలెనా

గ్రామములు రత్నములు గజముఖ్య వస్తువులు
ఆమని భూకాంతకు నంగభేదాలు
భామిని యాకె మగని ప్రాణధారి లెంకలము
వోమి మాకాతఁడే యిచ్చీ వొరులియ్యవలెనా

పసగల పదవులు బ్రహ్మనిర్మితములు
వెస బ్రహ్మతండ్రి శ్రీవెంకటేశుఁడు
యెసఁగి యాతఁడే మమ్ము నేలి యిన్నియునిచ్చె
వొసగిన మా సొమ్ములు వొరులియ్యవలెనా.

# 17

[భవబంధములను త్రోయుటెట్లు. ఇంద్రియములను అరికట్టు టెట్లు. ఆశాపాశములను తొలగించుకొనుట యెట్లు. ఒక దానితో ఒకటి పెనవేసుకొన్నవి. ఈలంకెల సంకెలలను తప్పించుకొనే వెరవులేక ఉన్నాను. నా విన్నపమాలించి నన్ను కడతేర్చు. – అన్నదే అన్నముని ఆవేదన.]

మలహరి

పల్లవి:

దేవ యీతగవు దీర్చవయ్యా
వేవేలకు నిది విన్నపమయ్యా

చరణాలు:

తనువునఁ బొడమిన తతి నింద్రియములు
పొనిఁగి యెక్కడికిఁ బోవునయా
పెనఁగి తల్లికడ బిడ్డలు భువిలో
యెనగొని యెక్కడి కేఁగుదు రయ్యా

పొదుగుచు మనమునఁ బొడమిన యాసలు
అదన నెక్కడికి నరుగునయా
వొదుగుచు జలముల నుండు మత్స్యములు
పదపడి యేగతిఁబాసే నయ్యా

అలి నొకటొకటికి లంకెలు నివే
అలరుచు నేమని యందు నయా
బలు శ్రీవేంకటపతి నాయాత్మనుఁ
గలిగితి వెక్కడి కలుషము లయ్యా.

# 18

[ఈ సృష్టి అశాశ్వతము. ఈ నా బ్రతుకు అబద్ధము. అయినా నామనస్సు పరిపరివిధముల మోహాలకు లోనైనది. వంచనలకు, మాయలకు, నటనలకు భ్రమసిన నామనస్సునకు పట్టిన అజ్ఞానపు తెరలను తొలగించు. ఓ హరీ! నాకు నీవే దిక్కు--ఇది అన్నముని మానసబోధ.]

లలిత

పల్లవి:

నటనల భ్రమయకు నామనసా
ఘటియించు హరియె కలవాఁడు

చరణాలు:

ముంచిన జగమిది మోహినీగజము
పొంచిన యాస పుట్టించే దిది
వంచనల నిజమువలెనే వుండును
మంచులు మాయలె మరునాఁడు

సరి సంసారము సంతలకూటమి
సొరిదిఁ బచారము చూపేదిది
గరిమ నెప్పుడుఁ గలకల మనుచుండును
మరులగు విధమే మాపటికి

కందువ దేహము గాని ముదియదిది
అందిన బహురూప మాడేదిది
యెందును శ్రీవెంకటేశ్వరుఁ డుండును
డిందుపడఁగ నిదె తెరమరఁగు.

# 19

[మందుకాని మందు విష్ణునామము. అది చిత్తశాంతికి మందు. భవరోగాలను రూపు మాపేది హరిపాద జలము. ఇహపర ములలో మనకు బలము కలిగించే దివ్యౌషధం ఇందిరారమణుని పూజ. అన్నముడు తాను తపస్సు చేసి సాధించిన ఈ ఔషధాన్ని మనందరికీ పంచియిచ్చినాడు.]

### లలిత

పల్లవి :

అన్నిటికి నిది పరమౌషధము
వెన్నుని నామమే విమలౌషధము

చరణాలు :

చిత్తశాంతికిని శ్రీపతి నామమె
హత్తిన నిజ దివ్యౌషధము
మొత్తపు బంధవిమోచనంబునకు
చిత్తజగురుఁడే సిద్ధౌషధము

పరిపరి విధముల భవరోగములకు
హరి పాదజలమె యౌషధము
దురితకర్మములఁ దొలఁగించుటకును
మురహరు పూజే ముఖ్యౌషధము

యిల నిహపరముల నిందిరావిభుని
నలరి భజింపుటె యౌషధము
కలిగిన శ్రీవేంకటపతి శరణమె
నిలిచిన మాకిది నిత్యౌషధము.

# 20

[ పరదాస్యములో నలిగి బ్రతికి చచ్చుట కంటె శ్రీ వేంకటపతిని సేవించి శాశ్వతమైన సాయుజ్యమును పొందుటమేలు. ఇది అన్నముని ఆత్మవిశ్వాసం. ]

సామంతం

పల్లవి :

మనుజుఁడై పుట్టి మనుజుని సేవించి
అనుదినమును దుఃఖ మందనేలా

చరణాలు :

జుట్టెఁడు గడుపుకై చొరని చోట్లు చొచ్చి
పట్టెడు గూటికై బతిమాలి
పుట్టిన చోటికే పొరలి మనసు పెట్టి
వట్టి లంపటము వదలనేరఁడు గాన

అందరిలోఁబుట్టి అందరిలోఁ జేరి
అందరి రూపము లటు దానై
అందమైన శ్రీవేంకటాద్రీశు సేవించి
అందరానిపద మందె నటు గాన.

# 21

[నాశము శరీరాలకే కాని జీవునికి కాదు. జీవుడు నిత్యుడు. మన శరీరాలు జీవుని అధీనాలు. వాడు మాయకు బద్ధుడు. అది భగవంతుని చేతిలోనిది. ఇక మనమెవ్వరము। మనదేమున్నది। ఎందుకు మనదికానిదానిమీద మనకు ఈ లేనిపోని మమకారాలు.]

నాట

పల్లవి:

ఎవ్వరెవ్వరి వాఁడో యీ జీవుఁడు
ఎవ్వరికి నేమౌనో యీ జీవుఁడు

చరణాలు:

ఎందరికిఁ గొడుకుగాఁడీ జీవుఁడు వెనక
కెందరికిఁ దోఁబుట్టఁడీ జీవుఁడు
ఎందరిని భ్రమయించఁడీ జీవుఁడు, దుఃఖ
మెందరికిఁ గావింపఁడీ జీవుఁడు

ఎక్కడెక్కడఁ దిరుగఁడీ జీవుఁడు, వెనక
కెక్కడో తనజన్మ మీ జీవుఁడు
ఎక్కడి చుట్టము తనకు నీ జీవుఁడు, ఎప్పు
డెక్కడికి నేగునో యీ జీవుఁడు

ఎన్నఁడును జేటులేని జీవుఁడు, వెనక
కెన్ని తనువులు మోవఁడీ జీవుఁడు
ఎన్నఁగల తిరువేంకటేశు మాయలఁదగిలి
యెన్ని పదవులఁ బొందఁడీ జీవుఁడు.

# 22

[జీవస్వరూపంతో బాటు దైవస్వరూపాన్ని తెలుసుకోవడం, జ్ఞాన భక్తి వైరాగ్య మార్గాలతో ఆచార్యవిశ్వాసం వదలక, శరణాగతి తత్త్వంతో వేంకటేశ్వరుని సేవ చేయడమే బ్రహ్మానంద వేదాంత రహస్యం.]

## హిందోళవసంతం

పల్లవి :

మూఁడే మాటలు మూఁడు మూండ్లు తొమ్మిది
వేఁడుకొని చదువరో వేదాంతరహస్యము

చరణాలు :

జీవస్వరూపము చింతించి యంతటాను
దేవునివైభవము తెలిసి
భావించి ప్రకృతిసంపద యిది యెఱుఁగుటే
వేవేలు విధముల వేదాంతరహస్యము

తనలోని జ్ఞానము తప్పకుండాఁదలపోసి
పనితోడ నందువల్ల భక్తి నిలిపి
మనికిగా వైరాగ్యము మఱవకుండుటే
వినవలసినయట్టి వేదాంతరహస్యము

వేడుకతో నాచార్య విశ్వాసము గలిగి
జాడల శరణాగతి సాధనముతో
కూడి శ్రీవెంకటేశ్వరుఁ గొలిచి దాసుఁడౌటే
వీడని బ్రహ్మానంద వేదాంతరహస్యము.

# 23

[ ఓ కర్మమా! మమ్ము బాధల పెట్టకు. మేమునీ చేతిలో చిక్కితిమి. మా మతిహీనత తలచుకొని మార్గాంతరమును చూపి పుణ్యము కట్టుకొమ్ము. నీవు వేంకటేశ్వరుని మాయల చిక్కినావు. మేము హరిదాసులము. ఇక నీవు తొలగిపొమ్ము. మామీద నీపెత్తనము సాగదు. ఈ భక్తుడు కర్మాధికారమునే ప్రశ్నించినాడు. ]

## శ్రీరాగం

పల్లవి:

ఎన్ని బాధలఁబెట్టేయేఁచెదవు నీవింకనెంతకాలముదాఁకకర్మమా
మన్నించుమనుచు నీ మఱుఁగుఁజొచ్చితిమి మా మాటాల కింపవో-
కర్మమా

చరణాలు:

ప్రతిలేని దురితముల పాలుసేయక నన్ను పాలించవైతివో కర్మమా
తతితోడ నాత్మపరితాపంబు తోడుతను తగులేల చేసితో కర్మమా
జితకాములకుఁగాని చేతికిని లోనై చిక్కవేకాలంబు కర్మమా
మతిహీనులైనట్టి మాకునొక పరిపాటి మార్గంబు చూపవో కర్మమా

ఆసలనియెడి తాళ్ల నంటఁగట్టుక విధికి నప్పగించితివిగదె కర్మమా
వాసి విడిచితిమి నీవారమైతిమి మమ్ము వన్నె చెడనీకు వోకర్మమా
కాసుకును కొరగాని గతిలేని పనికిఁగా కాలూఁదనీవేల కర్మమా
ఓసరించొక మారు వొయ్యనే వొకరీతి నొల్లవని తొలగుమీ కర్మమా

తిరువేంకటాచలాధిపుని మాయలచేత దెసలఁదిరిగినయట్టి కర్మమా
హరిదాసులగువారి నాదరింతువుగాక అంత నొప్పింతువా కర్మమా
వరుస నేనుఁగుమీఁదివాని సున్నం బడుగ వచ్చునా నీకిట్ల కర్మమా
పరమపురుషోత్తముని భ్రమతఁబడి నీవిట్ల బట్టబయలైతిగా కర్మమా.

# 24

[చంచలమైన మనస్సుతో చదువుల సారాన్ని, శాస్త్ర రహస్యాలను చవిచూడలేదు. నాస్తికునకు దైవతత్త్వం బోధపడదు. వేంకటేశ్వరుని త్రికరణశుద్ధితో సేవించినవాడు పరమపావనుడగును.]

నాట

పల్లవి :

తనకేడ చదువులు తనకేడ శాస్త్రాలు
మనసు చంచలబుద్ధి మానీనా

: చరణాలు :

జడ్డు మానవుఁడు చదువఁ జదువ నాస
వడ్డివారుఁగాక వదలీనా
గుడ్డికుక్క సంతకుఁబోయి తిరిగిన
దుడ్డుపెట్లేకాక దొరకీనా

దేవదూషకుఁడై తిరిగేటి వానికి
దేవతాంతరము తెలిసీనా
శ్రీ వేంకటేశ్వరు సేవాపరుఁడుఁగాక
పావనమతియై పరగీనా.

# 25

[ఇవి మహాలక్ష్మివిలాసాలు.]

గుండక్రియ

పల్లవి:

రూకలై మాడలై రువ్వలై తిరిగీని

అనుపల్లవి:

దాకొని ఉన్నచోట తానుండ దదివో

చరణాలు:

ఒకరి రాజుఁజేసు నొకరి బంటుగ జేసు
ఒకరి కన్నెకల వేరొకరి నమ్మించు
ఒకచోట నున్నధాన్య మొకచోట వేయించు
ప్రకటించి కనకమే భ్రమయించీ జగము.

కొందరి జాళెలు నిండు కొందరికి సొమ్ములవు.
కొందరి పుణ్యులఁజేసు కొందరి పాపులఁజేసు
కొందరి కొందరిలోన కొట్లాట పెట్టించు
పందెమాడినటువలె పచరించు పసిఁడి.

నిగనిగ మనుచుండు నిక్షేపమై యుండు
తగిలి శ్రీవేంకటేశు తరుణియై తానుండు
తెగని మాయైయుండు దిక్కుదెసయై యుండు
నగుతా మాపాలనుండి నటియించు పసిఁడి

# 26

[జుట్టెడు కడుపు - పట్టెడు తిండి. దీని కోసం పడరాని పాట్లతో కుమిలిపోవడమెందుకు. ఈ భ్రాంతులను విడనాడి పరమాత్ముని సేవానిరతి యందు మనస్సును లగ్నం చేయుటమేలు.]

## గుండక్రియ

పల్లవి :

కడుపెంత తాఁగుడుచు కుడుపెంత దీనికై
పడని పాటులనెల్లఁబడి పొరలనేలా.

చరణాలు :

పరుల మనసునకు నాపదలు గలుగఁగఁజేయు
పరితాపకరమైన బ్రదుకేలా
సొరిది నితరుల మేలు చూచి సైఁపఁగ లేక
తిరుగుచుండెడి కష్టదేహమిది యేలా.

ఎదిరి కెప్పుడుఁజేయు హితమెల్లఁదనదనుచు
చదివి చెప్పనియట్టి చదువేలా
పొదిగొన్న యాసలో బుంగుడై సతతంబు
సదమదంబై పడయు చవులు తనకేలా.

శ్రీవేంకటేశ్వరుని సేవారతికిఁగాక
జీవన భ్రాంతిఁబడు సిరులేలా
దేవోత్తముని నాత్మఁ దెలియనొల్లక పెక్కు
త్రోవ లేఁగిన దేహి దొరతనం బేలా.

# 27

[నీళ్లు పోయవలసింది మొక్కల మొదళ్లకే. కొనలకు కాదు. ఎదలోఉన్న పరమాత్ముని వదలి ఎక్కడెక్కడో వెదకడ మెందుకు, అనవసరం.]

## భైరవి

పల్లవి :

మొదలుండఁగొనలకు మోచి నీళ్ల వోయనేల

అనుపల్లవి :

ఎదలో నీ వుండఁగా - నితరములేలా

చరణాలు :

నిగమ మార్గమున నే నడచేనంటే
నిగమము లెల్లను నీ మహిమే
జగము లోకులఁజూచి జరిగెద నంటే
జగములు నీమాయ జనకములు

మనసెల్ల నడ్డపెట్టి మట్టున నుండే నంటే
మనసు కోరికలు నీ మతకాలు
తనువు నింద్రియములు తగ గెలిచేనంటే
తనువు నింద్రియములు దైవమ నీ మహిమ

ఇంతలోని పనికిఁగ ఇందు నందుఁజొరనేల
చెంత నిండు చెరువుండఁ జెలమలేలా
పంతాన శ్రీవేంకటేశ పట్టి నీకె శరణంటి
సంతకూటాల ధర్మపు సంగతి నాకేలా.

# 28

[ జాతిభేదాలు శరీరానికి సంబంధించినవి. వానికి శరీరముతో సరి. ఆత్మ పరిశుద్ధమైనది దానికి ఏదోషమూ అంటదు. హరిని గురించిన విజ్ఞానము, ధర్మమూలమైన పరతత్త్వజ్ఞానము, విష్ణు నామస్మరణము - ఇవే సుజాతికి మూలములు. ]

లలిత

పల్లవి :

విజాతు లన్నియు వృథా వృథా
అజామిళాదుల కది యేజాతి

చరణాలు :

జాతిభేదములు శరీర గుణములు
జాతిశరీరముఁదోడనే చెడు
ఆతుమ పరిశుద్ధం బెప్పుడును అది నిర్దోషం బనాది
యీతల హరి విజ్ఞానపు దాస్యంబిది యొక్కటేపో సుజాతి

హరి యిందరిలో నంతరాత్ముఁడిదె
ధరణి జాతిభేదము లెంచిన
పరమ యోగు లీభావ మష్టమదము భవనికారమని మానిరి
ధరణిలోనఁ బరతత్త్వజ్ఞానము ధర్మమూలమే సుజాతి

లౌకికవైదిక లంపటులకు నివి
కైకొను నవశ్యకర్తవ్యంబులు
శ్రీకాంతుఁడు శ్రీవేంకటపతి సేసిన సంపాద మిందరికి
మేకొని యిన్నియు మీరినవారికి మీనామమే సుజాతి.

# 29

[ కులము కాదు ప్రధానం; గుణమే. సత్యము, భూతదయ, ధర్మ తత్పరత, పరహితము, హరిభక్తి - ఇవే భగవంతునికి సంబంధించిన కులమునకుండవలసిన గుణాలు. ]

## భూపాళం

పల్లవి :

ఏ కులజుఁడేమి యెవ్వఁడైననేమి
ఆఁకడ నాతఁడె హరినెఱిఁగినవాఁడు

చరణాలు :

పరగిన సత్యసంపన్నుఁడైన వాఁడే
పరనిందసేయఁ దత్పరుఁడు గాని వాఁడు
అరుదైన భూతదయానిధి యగువాఁడే
పరులుదానే యని భావించువాఁడు.

నిర్మలుఁడై యాత్మనియతి గలుగువాఁడే
ధర్మతత్పరతబుద్ధిఁ దగిలినవాఁడు
కర్మమార్గములు తడవనివాఁడే
మర్మమై హరిభక్తి మఱవనివాఁడు.

జగతిపై హితముగాఁ జరియించువాఁడే
పగలేక మతిలోన బ్రదికినవాఁడు
తెగి సకలము నాత్మఁదెలిసినవాఁడే
తగిలి వెంకటేశు దాసుఁడయినవాఁడు.

# 30

[ పరుల పంచలో బ్రతికేమనుష్యుల జీవితము కడురోత. పశువుగా పక్షిగా తుదకు అడవిలో మృగంగా చెట్టుగా అయినా జీవించ వచ్చునుగాని పరదాస్యపు బ్రతుకువద్దు. ఇది అన్నముని వ్యక్తిత్వమునందలి తీక్ష్ణత. ]

శంకరాభరణం

పల్లవి :

ఛీ ఛీ నరులదేఁటి-జీవనము

అనుపల్లవి :

కాచుక శ్రీహరి నీవే కరుణింతుగాక.

చరణాలు :

అడవిలో మృగజాతియైనాఁ గావచ్చుఁగాక
వడి నితరులఁ గొలువంగ వచ్చునా.
ఉడివోని పక్షియై వుండనైనవచ్చుఁగాక
విడువ కెవ్వరినైనా-వేఁడవచ్చునా.

పసురమై వెదలేని పాటుపడవచ్చుఁగాక
కసివో నొరులఁబొగడఁగావచ్చునా.
ఉసురుమానై పుట్టి వుండనైనవచ్చుఁగాక
విసువక పీరివారి వేసరించవచ్చునా.

ఎమ్మెలఁబుణ్యాలుసేసి యిల యేలవచ్చుఁగాక
కమ్మి హరిదాసుఁడు-గావచ్చునా.
నెమ్మది శ్రీవేంకటేశ నీ చిత్తమేకాక
దొమ్ముల కర్మములివి తోయవచ్చునా.

# 31

[ కదలి అలలకు మనసులోని కోరికలకు అంతములేదు. అలలు నిలిచిన తర్వాత స్నానమాడదలచుట, మనసు నిలకడ పొందిన తర్వాత భగవంతుని తత్త్వమును తెలుసుకొనదలచుట - రెండూ అసాధ్యములే. అటువంటివారి బ్రదుకు తెగదు తెల్లవారదు. ]

శుద్ధవసంతం

పల్లవి :

కడలుడిపి నీరాడఁగాఁ దలఁచువారలకు
కడలేని మనసునకుఁ గడమ యెక్కడిది.

: చరణాలు :

దాహ మణఁగిన వెనుక తత్త్వమెఱిఁగెదనన్న
దాహమేలణఁగు తా తత్త్వమే మెఱుఁగు
దేహంబుగలయన్ని దినములకును పదార్థ
మోహమేలణఁగు తా ముదమేల కలుగు.

ముందరెఱిఁగిన వెనుక మొదలు మఱచెదనన్న
ముందరే మెఱుఁగు తా మొదలేల మఱచు
అందముగ తిరువేంకటాద్రీశు మన్ననల
కందువెఱిఁగిన మేలు కలనైన లేదు.

# 32

[పరమాత్ముని పాటకు మనమాడు ఆట. గృహిణి పరమాత్ముడు. రోకలి మాయ. బియ్యము జీవులు. రోలు సంసారం. ఇరు దరులు సుఖదుఃఖాలు. ఇదంతా భగవంతుని వినోదం, మనం కేవలము పాత్రధారులము. ఇది జగన్నాటకం. సూత్రధారి వేంకటేశ్వరుడు.]

కేదారగౌళ

పల్లవి:

పరమాత్ముని నోరఁబాడుచును ఇరు
దరులు గూడఁగ దోసి దంచీ మాయ.

చరణాలు:

కొలఁది బ్రహ్మాండపుఁ గుందెనలోన
కులుకు జీవులను కొలుచునించి
కలికి దుర్మోహపు రోకలివేసి
తలఁచి తనువులను దంచీమాయ.

తొంగలి రెప్పల రాత్రులుఁబగలును
సంగడి కన్నులుగా సరిఁదిప్పుచు
చెంగలించి దిక్కులనే చేతులూచుచు
దంగుడు బియ్యాలుగా దంచీమాయ.

అనయము తిరువేంకటాధీశ్వరుని
పనుపడి తనలోఁ బాడుచును
వొనరి విన్నాణి జీవులనెడి బియ్యము
తనర నాతనికియ్య దంచీమాయ.

# 33

[ ఈ ప్రపంచం బొమ్మలాట వంటిది. దానిని ఆడించే సూత్రధారుడు వేంకటేశ్వరుడు. ]

కన్నడగౌళ

పల్లవి :

ఆటవారిఁగూడి-తౌరా (బొమ్మలాట)

అనుపల్లవి :

ఆటవారిగూడి-అన్నిచోట్ల బొమ్మ
లాట లాడించ-నధికుఁడవైతివి.

చరణాలు :

గురుతరమగు పెద్ద కొట్టాములోపల
తిరమైన పెనుమాయ తెరగట్టి
అరయ నజ్ఞానము లవి యడ్డముగఁజేసి
పరగ సుజ్ఞాన దీపములు ముట్టించి

తోలుబొమ్మల-దొరకొని గడియించి
గాలిచేత వానిఁ-గదలించి
తూలేటి రసములు-తొమ్మిది గదియించి
నాలుగు ముఖముల-నలువున నాడించ

నిన్నె మెత్తురుగాని నీకేమీ నీలేరు
మన్నించు దాతలు-మఱి లేరు
ఎన్నఁగఁ దిరువేంక-టేశ్వర నీదాసు
లున్నతులై నిన్ను-నుబ్బించి పొగడఁగ.

# 34

[వేంకటేశ్వరుడు నేతవ్యాపారి. ఆతని సృష్టిస్థితిలీలలు నేత చేరములు. ఈ వ్యాపారికోసం ఎక్కడా గాలించ నక్కరలేదు. 'ఎందెందు వెదకి చూచిన అందందే కలడు.']

## వరాళి

పల్లవి :

వాడల వాడల వెంట - వాడెవో
నీడనుండి చీరలమ్మే - నేఁత బేహారి

చరణాలు :

పంచభూతము లనెడి - పలువన్నె నూలు
చంచలపు గంజితోడ - చరినేసి
కొంచెపు కండెల నూలి - గుణముల నేసి
మంచి మంచి చీరలమ్మె - మారు బేహారి

మటమాయములఁ దన - మగువ పసిఁడి నీరు
చిటిపొటి యలుకలఁ - జిలికించఁగా
కుటిలంపుఁ జేఁతలు - కుచ్చులుగాఁ గట్టి
పటవాళి చీరలమ్మె - బలు బేహారి

మచ్చిక జీవుల పెద్ద - మైలసంతలలోన
వెచ్చపు కర్మధనము - విలువచేసి
పచ్చడాలుగాఁ గుట్టి - బలువేంకటపతి
యిచ్చకొలఁదుల నమ్మె - యింటిబేహారి.

# 35

[ఇది శ్రీరంగనాథుని ఉయ్యాలపాట. వటపత్రశాయిని శ్రీరంగ శిశువును చేసి అన్నముడు ఉయ్యాల నూస్తూ పాటపాడినాడు. అన్నమయ్య శ్రీరంగమును దర్శించినాడనుటకు ఈ కీర్తన సాక్ష్యం.]

ఆహిరి

పల్లవి :

తొల్లియును మఱ్ఱాకు తొట్టెలనె యూఁగెఁగన
చెల్లుబడి నూఁగిని శ్రీరంగశిశువు

చరణాలు :

కలికి కావేరి తరగల బాహులతలనే
తలఁగ కిటు రంగమధ్యపు తొట్టెలన్
పలుమారుఁ దనునూఁచి పాడఁగా నూఁగిని
చిలుపాల నెలవితో శ్రీరంగ శిశువు

అదివో కమలజుని తిరువారాధనం బనఁగ
అదనఁ గమలభవాండమను తొట్టెలన్
ఉదధులు తరంగములు నూఁచఁగా నూఁగిని
చెదరని సిరులతోడ శ్రీరంగ శిశువు

వేదములె చేరులై వెలయంగ శేషుఁడే
పాదుకొను తొట్టెలై పరగఁగాను
శ్రీదేవితోఁ గూడి శ్రీవేంకటేశుఁడై
నేదదేరెడి వాఁడె శ్రీరంగశిశువు.

# 36

[కలియుగంలో భగవంతుని సంకీర్తనముల ద్వారా పూజించవలె నని శాస్త్రప్రమాణం. సకల దుఃఖాలను రూపుమాపే హరినామ సంకీర్తనం చేయండి అని అన్నముడు చెవినిల్లు కట్టుకొని చెప్తున్నాడు.]

## సామంతం

పల్లవి :

చాలదా బ్రహ్మమిది సంకీర్తనం మీకు
జాలెల్ల నడఁగించు సంకీర్తనం

చరణాలు :

సంతోషకరమైన సంకీర్తనం
సంతాప మణఁగించు సంకీర్తనం
జంతువుల రక్షించు సంకీర్తనం
సంతతముఁ దలఁచుఁడీ సంకీర్తనం

సామజముఁ గాచినది సంకీర్తనం
సామమున కెక్కుడీ సంకీర్తనం
సామీప్య మిందరికి సంకీర్తనం
సామాన్యమా విష్ణుసంకీర్తనం

జముబారి విడిపించు సంకీర్తనం
సమబుద్ధి వొడమించు సంకీర్తనం
జమళి సౌఖ్యము లిచ్చు సంకీర్తనం
శమదమాదులఁ జేయు సంకీర్తనం.

జలజాసనుని నోరి సంకీర్తనం
చలిగొండసుత దలఁచు సంకీర్తనం
చలువ గడు నాలుకకు సంకీర్తనం
చలపట్టి తలఁచుఁడీ సంకీర్తనం

సరవి సంపదలిచ్చు సంకీర్తనం
సరిలేని దిదియపో సంకీర్తనం
సరుస వేంకటవిభుని సంకీర్తనం
సరుగనను దలఁచుఁడీ సంకీర్తనం.

# 37

[తాళ్లపాక అన్నమాచార్యులను స్మరిస్తూ ప్రశంసిస్తూ ఆతని కుమారుడు పెదతిరుమలయ్యో మనుమడు చినతిరుమలయ్యో చెప్పిన సంకీర్తనము. వేదాలను మంచిపదాలుగ చేసి నారద సనకసనందులవలె సామగాన సప్తస్వరములతో పాడి అలమేలు మంగా వేంకటేశ్వరులను అర్చించిన మహాభక్తుడు అన్నమయ్య.]

లలిత

పల్లవి :

శరణంటి మాతని సంబంధమునఁజేసి
మరిగించి మమునేలి మన్నించవే

చరణాలు :

సకలవేదములు సంకీర్తనలు చేసి
ప్రకటించి నినుఁబాడి పావనుఁడైన
అకలంకుడు తాళ్లపాకన్నమాచార్యుల
వెకలియై యేలిన శ్రీవెంకటనిలయ

నారదాది సనకసనందనాదులవలె
పేరుపడి నిన్నుఁబాడిపెద్దలైనట్టి
ఆరీతిఁ దాళ్లపాకన్నమాచార్యుల
చేరి యేలినయట్టి శ్రీవెంకటనిలయ

సామవేద సామగాన సప్తస్వరములను
బాముతో నీసతి నిన్నుఁబాడినయట్టి
ఆముకొన్న తాళ్లపాకన్నమాచార్యుల
వేమరు మెచ్చిన శ్రీవెంకటనిలయ.

# 38

[భగవంతుడు మేలుకొంటే జగమంతా మేలుకొంటుంది. మన జీవితాలకు స్వామి మేలుకొలుపే శ్రీనివాసరక్ష.]

భూపాళం

పల్లవి:

మేదిని జీవులఁగావ మేలుకోవయ్యా
నీదయే మాకెల్ల రక్ష నిద్రమేలుకోవయ్యా

చరణాలు:

తగు గోపికల కన్నుఁదామరలు వికసించె
మిగుల సూర్యనేత్రుఁడ మేలుకోవయ్యా
తెగువ రాక్షసులనే తిమిరము విరియఁగ
నెగడిన పరంజ్యోతి నిద్ర మేలుకోవయ్యా

ఘనదురితపు నల్లఁగలువల వికసించె
మినుకు శశివర్ణుఁడ మేలుకోవయ్యా
పనివడి వేదాలనే పక్షులెల్లాఁబలుకఁగ
జనక యాశ్రితపారిజాత మేలుకోవయ్యా

వరలక్ష్మి కుచచక్రవాకము లొండొంటిరాయ
మెలయు దోషారహిత మేలుకోవయ్యా
పొరసి నీవు నిత్యభోగములు భోగించ
నిరతి శ్రీవెంకటేశ నేఁడు మేలుకోవయ్యా.

# 39

[ అలమేలుమంగ యౌవన శృంగారాలు ఆమని సొగసులు. సహజ సౌందర్యవిలాసాలతో వేంకటేశ్వరుని మురిపించి తన సిరి నగరులో శాశ్వతముగ బంధించినది. ఆ దివ్యదంపతుల ప్రణయ లీలలే మన పాలిటి కల్యాణాలు. ]

## శంకరాభరణం

పల్లవి :

ఏమని పొగడుదుమే యిఁక నిన్నును
ఆమని సొబగుల అలమేల్మంగ

చరణాలు :

తెలిఁగన్నుల నీ తేటలే కదవే
వెలయఁగ విభునికి వెన్నెలలు
పులకల మొలకల పొదు లివిగదవే
పలుమరుఁ బువ్వుల పానుపులు

తియ్యని నీమోవి తేనెలే గదవే
వియ్యపు రమణుని విందులివి
ముయ్యక మూసిన మొలక నవ్వుగదె
నెయ్యపుఁ గప్రపు నెరిబాగాలు

కైవసమగు నీ కాఁగిలే గదవే
శ్రీవేంకటేశ్వరు సిరినగరు
తావుకొన్న మీతమకములేకదే
కావించిన మీ కల్యాణములు.

# 40

[నాయిక వేంకటపతి ప్రాయకమును సంపాదించినది. ఆ వలపును నర్మగోపనం చేయుటకు విరహమును అభినయించనది. ఈ రహస్యము తెలిసిన సఖి నాయికను ఆక్షేపించుచున్నది.]

## శంకరాభరణం

పల్లవి:

నీడల చూపులు నీకేలే యీ
వాడక వాడెడి వడ నీకేలే

చరణాలు:

నిలువుల నటనలు నీకేలే, యీ
నిలుగుల నడపులు నీకేలే
నెలవుల కరఁగులు నీకేలే, యీ
కులికెడి నును సిగ్గులు నీకేలే

నెఱుల చెదరులివి నీకేలే, యీ
నెఱవగు చదురులు నీకేలే
నెఱతనపు సిరులు నీకేలే, యిదె
చెఱఁగున మూసెదు సఖి నీకేలే

నిక్కపు బొంకులు నీకేలే
నిక్కల గంటివి నీకేలే
నిక్కితి వారపుల నీకేలే, యిదె
దక్కె వేంకటోత్తముఁడింకేలే.

# 41

[కలికి యాగము చేసినది. ఉద్దేశము దేవతాప్రీతి. దివ్య భోగము ను ఆశించిన నాయిక కామయాగముచేసి వేంకటేశ్వరుని పొందినది. యాగనిర్వహణలో ఎక్కడా శైథిల్యము లేదు. అవభృథము కూడ నిర్వహించినది.]

కన్నడగౌళరాగం

పల్లవి:

కామయాగము చేసెఁ గలికి తన
ప్రేమమే దేవతాప్రీతిగాను

చరణాలు:

పొలుపలర సురత తాంబూలరస పానంబు
నలినాక్షి సోమపానంబుగాను
కలకలంబుల మంచి కలరవంబుల మ్రోఁత
తలకొన్న వేదమంత్రములుగాను

పడఁతి తన విరహతాపమునఁ బుట్టిన యగ్ని
అడరి దరికొన్న హోమాగ్నిగాను
ఒడఁబడిక సమరతుల నుదయించిన చెమటఁ
దడియుటే యవభృథంబుగాను

తనరఁ గుచముల రుచులు దంతక్షతక్రీడ
ననుపైన పశుబంధనంబుగాను
ఎనసి శ్రీ తిరువేంకటేశ్వరుని పొందు
ఘనమైన దివ్యభోగంబుగాను.

# 42

[పాలారగించడం తెలుసు మనకు. ఈ మహావాగ్గేయకారుడు వలపారగించడం కూడ తెలిపినాడు. వేంకటేశుని మన్ననలను పళ్లెముపట్టి చూపినాడు. నాయిక అలుక ఆకలి తీరియే ఉండును.]

## దేశి

పల్లవి :

వలపారగించవమ్మ వనిత నీ
యలుక చిత్తమున కాఁకలి సేసినది

చరణాలు :

అడియాసలనె పక్వమైన సోయగపు
వెడయలుకల మంచి వేఁడి వేఁడి రుచులు
ఎడసేసి తాలిమి నెడయించి పైపైనె
పొడమిన తమకంపు బోనము వెట్టినది

ఆమంచి మధురంపు అధరామృతముల
వేమారుఁ దావులు చల్లు వెన్నెలబయటను
కోమలపుఁ దరితీపు కోరికఁ గుమ్మరించి
భామకు పూఁబానుపు పళ్లెము వెట్టినది

కన్నుల కాంక్ష లనెడి కళవళములు దీరె
సన్నపు నవ్వులనెడి చనవగ్గలించెను
అన్నువపు మరపు నీకంతనింతఁగలిగెనేఁ
డిన్నియును దిరువేంకటేశుని మన్ననలు.

# 43

[ఇది అత్తాకోడళ్ల జగడం. వాళ్ళగుట్టు రచ్చకెక్కినది. ఈ అత్తాకోడళ్లు ఎవరోకాదు లక్ష్మి సరస్వతులే.]

పాడి

పల్లవి:

రావే కోడల రట్టడి కోడల
పోవే పోవే అత్తయ్యా పొందులు నీతోఁజాలును

చరణాలు:

రంకెలు వేయుచు రాజులెదుట నీవు
కొంకు గొసరులేని కోడల
పంకజముఖి నీవు పలుదొడ్డవారిండ్ల
అంకెలఁ దిరిగేవు అత్తయ్యా

ఈడాడ నలుగురు నేగురు మొగలతో
కూడి సిగ్గులేని కోడల
వాడకుఁబదుగురి వలపించుకొని నీవు
ఆడాడఁ దిరిగేవు అత్తయ్యా

బొడ్డునఁ బుట్టిన పూఁపనికే నిన్ను
గొడ్డేరు తెత్తినే కోడల
గుడ్డముపయినున్న కోనేటిరాయని
నడ్డగించుకొంటి వత్తయ్యా.

# 44

[శ్రీనివాసుడు ఎంత శృంగారనాయకుడైనా సకలచరాచర సృష్టి కర్త, విరాట్స్వరూపుడు అని మరచుటెట్లు. భోగసమయమున మైమరచిన లక్ష్మికి ఇది అనుభవమునకు వచ్చినది.]

సాళంగనాట

పల్లవి :

చాలుఁ జాలును భోగసమయమున మైమఱపు
పాలుపడునట యేఁటి బ్రదుకురా వోరి

చరణాలు :

ఇందుముఖి నినుఁగౌఁగిలించి లోపలి జగము
కందునని నీ బిగువుఁగౌఁగిలే వదలె
పొందైన వారితోఁ బొసఁగఁ గౌఁగిటఁ జేర్పఁ
బొందు గాదట యేఁటి పొందురా వోరి

నెలఁత నీవాలుఁగన్నులు మూసి జగమెల్లఁ
గలయఁ జీఁకట్లైన గక్కనను వదలె
వలచి నంగనలు తమ వలసిన విలాసముల
వలను నెరపనిదేఁటి వలపురా వోరి

కొమ్మ నీ వురముపై గోరుదివియుచు నాత్మ
నిమ్మైన నను దాక నిద్దరినిఁదాకె
దిమ్మరివి కోనేటితిమ్మ నీపైఁ బ్రియము
కుమ్మరించని దేఁటి కోర్కిరా వోరి.

# 45

[కొలని గోపికల వలువలు అపహరించిన గోవిందుడే గోవర్ధనము నెత్తి గోవులను గోపాలురను కాపాడినవాడు. ఉట్లుకొట్టి ఊరేగిన వాడే దుష్టులను శిక్షించి ధర్మసంస్థాపనం చేసిన వేంకటాద్రి గోవిందుడు.]

## భూపాళం

పల్లవి:

కొండ వేల నెత్తినట్టి గోవిందా నిన్నుఁ
గొండించేరు యశోదకు గోవిందా

చరణాలు:

గొల్లెతలు మొక్కేరు గోవిందా నీ
కొల్లలచీర లిమ్మని గోవిందా
గొల్లువెన్న దొంగిలఁగ గోవిందా నిన్ను
కొల్లున నవ్వేరు వీరె గోవిందా

గోవులఁగాచేవేళ గోవిందా పిల్లఁ
గోవిని వలచిరి గోవిందా
గోవాళులై యమునలో గోవిందా నీకు
కోవరమున్నారురా గోవిందా

కొట్టేటి వుట్ల కింద గోవిందా నీతో
గొట్టెవాలై పెనఁగేరు గోవిందా
గుట్టుతో శ్రీవేంకటాద్రి గోవిందా కూడి
గొట్టానఁ బెట్టేరు బత్తి గోవిందా

# 46

[ఇది మన్మథుని దండయాత్రకు ప్రస్తాన భేరి. మదవదండు అప్పుడే పొడచూపినది.]

## కాంబోధి

పల్లవి:

పలపుల దాడివచ్చె వనితలారా, మఱి
దెలగోలేయఁగఁజొచ్చె నేలాగే

చరణాలు:

తూరుపునఁ బొడిచెఁ జందురుఁడు మిన్నుల మోవ
పారుతెంచె విరహుల బందికాఁడు
గోరపు వెన్నెలవెల్లిగొని మీఁద మీఁద నిప్పు
లేరై పారఁగఁజొచ్చె నెందు జొత్తమే

చందనపుఁగొండవంక చల్లగాలి తుదముట్టి
ముందుముంచె కదిసె దుమ్ములు లేవఁగా
మందమై పన్నీటి సోన మందు చల్లె నమ్ములై
యెందుచూచినఁదానే యేమిసేతమే

క్రొచ్చిపారె గుబ్బచన్నుగొండల చెమ్మటనీరు
రొచ్చుగఁ గస్తూరి దరులు జారఁగా
పచ్చిగా వెంటగిరిపతి యింతి గూడఁగాను
ఇచ్చకాలే గనమాయె నింకనేఁటిదే.

# 47

[ వాయిక మనస్సులో నారాయణుడే నిండి ఉన్నాడు. ఆమె చేష్టలు విలాసాలు వేంకటరమణుని స్వరూప స్వభావాలనే తెలుపు తున్నవి. ముఖము మనస్సులోని భావాలకు అద్దం పట్టి చూపు తున్నది. ]

## నాదనామక్రియ

పల్లవి :

సకలం హే సఖి జానామి తత్
ప్రకట విలాసం పరమం దధసే

చరణాలు :

అలిక మృగమదమయ మషీకలనో-
జ్జ్వలతాం హే సఖి జానామి
లలితం తవ పల్లవిత మనసిని
శ్చలతర మేఘశ్యామం దధసే ॥ సకలం ॥

చారుకపోల స్థల కరాంచిత వి-
చారం హే సఖి జానామి
నారాయణ మహినాయక శయనం
శ్రీరమణం తవ చిత్తే దధసే ॥ సకలం ॥

ఘన కుచ శైలాగ్రస్థిత విధుమణి-
జననం హే సఖి జానామి
కన దురసా వేంకట గిరి పతే
ర్వినుత భోగసుఖ విభవం దధసే. ॥ సకలం ॥

# 48

[విరహిణి అయిన నాయిక తపించినది. నాయకుని ఆహ్వానించు చున్నది.]

## దేసాళం

మేడలెక్కి నిన్నుఁజూచి - కూడేననే యాసతోడ
వాడుదేరి పున్నరందురా - వెంకటేశ
యాడనుంటి విందాఁకానురా

పిక్కటిల్లు చన్నులపై - చొక్కపు నీ వుంగరము
గక్కన నేనద్దుకొందురా - వెంకటేశ
లక్కవలె ముద్రలంటెరా

దప్పిగొంటివని నీకుఁ గప్పుర ముపారమిచ్చి
ముప్పిరి నీ విరహానను - వెంకటేశ
నిప్పనుచు భ్రమసితిరా

నిండఁబూచిన మానిపై - గండుఁగోవిల గూయఁగా
నిండిన నీ యెలుఁగంటాను - వెంకటేశ
అండకు నిన్ను రమ్మంటిరా

వుదయచందురుఁ జూచి - అదె నీపంజని సవి
యెదురుకోనే వచ్చితిరా - వెంకటేశ
బెదరి మారుమోమైతిరా

మిన్నక కేళాకూళిలో - వున్న తమ్మివిరులు నీ
కన్నులంటాఁ జేరఁబోఁగాను - వెంకటేశ
పన్ని మరునమ్ములాయరా

అనిన తుమ్మెదలు నీమేని కాంతిఁబోలునని
పూని చేతఁబట్టఁబోఁగాను - వేంకటేశ
సూనాస్త్రుని వేగులాయరా

కందువ మై చమరించి - గందవొడి చల్లుకొని
పొందనిన్నుఁ దలఁచితిరా - వెంకటేశా
అంది చొక్కుమందు లాయరా

బొండుమల్లె పానుపుపై - నుండి నిన్నుఁబాడిపాడి
నిండు జాగరము లుంటిరా - వెంకటేశ
యెండలాయ వెన్నెలలురా

నిద్దిరించి నీవు నాకు - వొద్దనుండఁ గలగంటి
చద్దివేఁడి వలపాయరా - వేంకటేశ
సుద్దులింకా నేమి సేసేవో

మల్లెపూవు కొనదాఁకి - యుల్లనను బులకించి
వుల్లము నీ కొప్పించితిరా - వెంకటేశ
కల్లగాదు మమ్ముఁగావరా

జోడుగూడి నీవు నేను - నాడుకొన్న మాటలెల్లా
గోడలేని చిత్తరువులై - వెంకటేశ
యూడా నామతిఁ బాయవురా

అద్దము నీడలు చూచి - ముద్దుమోవి గంటుండఁగా
కొద్దిలేని కాఁకతోడను - వెంకటేశ
పొద్దువోక తమకింతురా

పావురము రెక్కఁ జీటి - నీవొద్దికిఁ గట్టి యంపి
దేవరకే మొక్కుకొందురా - వెంకటేశ
నీవిందు రావలెనంటాను

బంగారు పీఁటపై నుండి - ముంగిటికి నీవు రాఁగా
తొంగి చూచి నిలుచుండఁగా - వెంకటేశ
యెంగిలి మోవేలడిగేవు

దంతపుఁబావాలు మెట్టి - పంతాన నేను రాఁగాను
యింతలో బలిమిఁబట్టేవు - వెంకటేశ
అంత నీకుఁ బ్రియమైతినా

పట్టుచీర కొంగు జారి - గుట్టుతో నేనుండఁగాను
వట్టి నవ్వు లేల నవ్వేవు - వెంకటేశ
దిట్టవు నీయంతవారమా

కొప్పువట్టి తీసి నీవు - చెప్పరాని సేఁతసేసి
తప్పక నేఁజూచినంతలో - వెంకటేశ
చిప్పిలేల చెమరించేవు

బొమ్మల జంకించి నన్ను - తమ్మిపూవున వేసితే
కమ్మియేల తిట్టు దిట్టేవు - వెంకటేశ
నిమ్మపంట వేతునటరా

నెత్తమాడేనంటా రతి - పొత్తుల పందేలు వేసి
వొత్తి నీవే వోడే వేలరా - వెంకటేశ
కొత్తలైన జాణ వౌదువు

వున్నతి శ్రీ వెంకటేశ - మన్నించి కూడితివిదే
నన్ను నెంత మెచ్చు మెచ్చేవు - వెంకటేశ
కన్నుల పండువలాయరా

చిలుకలు మనలోన - కలసిన యట్టివేళ
పలుకు రతిరహస్యాలు - వెంకటేశ
తలఁచి నేఁ దలవూఁతురా

నీకు వలచిన వలపు - లాకలొత్తె నామతిని
వాకున నేఁ జెప్పఁజాలరా - వెంకటేశ
లోకమెల్లా నెరిఁగినదే

పాయము నీకొక్కనికే - చాయగా మీఁదెత్తితిని
యీయెడఁ గైవాలకుండను - వెంకటేశ
మా యింటనే పాయకుండరా

ముమ్మాటికి నీబాసలే - నమ్మివున్నదాన నేను
కుమ్మరించరా నీకరుణ - వెంకటేశ
చిమ్ముఁ జీకటెల్లఁ బాయను.

# 49

[నల్లనివాడు, నవ్వు రాజిల్లెడి మోమువాడు. కరుణాకటాక్షము లను ప్రసరించువాడు. పుండరీకాక్షుడు. తిరువేంగడమున వెల సిన వాడు. మనపాలిటి దైవము.]

నాఁట

పల్లవి :

నల్లనిమేని నగవుఁజూపులవాఁడు
తెల్లని కన్నుల దేవుఁడు

చరణాలు :

బిరుదైన దనుజుల పీఁచమణఁచినట్టి
తిరుపుఁగైదువు తోడి దేవుఁడు
చెరిఁబడ్డ జగమెల్లఁ జక్కఁజాయకుఁదెచ్చి
తెరువు చూపినట్టి దేవుఁడు

నీటఁ గలసినట్టి నిండిన చదువులు
తేటపరచినట్టి దేవుఁడు
పాటిమాలినట్టి ప్రాణుల దురితపు
తీఁటవాపినట్టి దేవుఁడు

గురుతువెట్టఁగరాని గుణముల నెలకొన్న
తిరువేంకటాద్రిపై దేవుఁడు
తిరముగ ధ్రువునికి దివ్యపదం బిచ్చి
తెరచి రాజన్నట్టి దేవుఁడు

# 50

[వలువలను వదలి కొలనిలో జలకములాడిన గోపికల సిగ్గులను అపహరించి వారికి ముక్తిమార్గమును బోధించినవాడు శ్రీ కృష్ణుడు.]

ముఖారి

పల్లవి :

కొలనిలోన మును గోపికలు
మొలకనవ్వులతో మ్రొక్కేరి నీకు

చరణాలు :

పిరుఁదులు దాఁటిన పించెపు టలకల
తురుములు వీడఁగఁ దొయ్యలులు
అరిది నితంబము లందునె దాఁచుక
మురిపెపుఁ గరముల మొక్కేరి నీకు

నిద్దపు మానము నెలఁతలు లోఁగుచు
గద్దరి తొడలనె కట్టుచును
ముద్దుటుంగరంబుల కరములతో
ముద్దులు గునియుచు మొక్కేరి నీకు

పాలిండ్ల పెనుభారంబుల కర
మూలపు మెఱుఁగులు ముంచఁగను
వేలపుఁబ్రియముల వేంకటేశ నిను
మూలకుఁబిలుచుచు మొక్కేరి నీకు

# 51

[ "ధర్మాధర్మ పుణ్యపాపముల సూత్రాలకు అతీతుఁడైన స్వతంత్ర పరబ్రహ్మము శ్రీ వేంకటేశ్వరుఁడను తత్వమును సామాన్య దృష్టితో ప్రతిపాదించుట పదవస్తువు" (రా.అ.కృ.శర్మ) ]

సామంతరాగం

పల్లవి :

దిమ్మరి గాకేల మాను - ధీరుఁడైన కోనేటి
తిమ్మఁడు తాలోక మెల్ల తిరుగాడు వాఁడు

చరణాలు :

తోరమైన ముత్యాల - తొళసి పూసల పెద్ద
పేరు తన యురముపైఁ - బెట్టినవాఁడు
గారవంపు పచ్చపట్టు - గట్టినవాఁడు ఒ
య్యారపు గొల్లెతలఁగూడి ఆడినట్టి వాఁడు

పీలిచుట్టుఁ దలవాఁడు - పెద్దపెద్ద కన్నుల
వాలుఁజూపుల సిరికి - వలచువాఁడు
జాలిఁబెట్టి లోకమెల్ల - జట్టిగొన్నవాఁడు తా
నేలనుండి మింటఁబార - కాలుచాఁచువాఁడు

కొండ మోచినట్టి వాఁడు - కొండ వేలనెత్తువాఁడు
కొండంత రాకాసులఁ - గొట్టినవాఁడు
కొండవంటి దొరయైన - కొండలకోనేటివాఁడు
కొండమోపరులనెల్లఁ - గూడఁబెట్టినాఁడు

# 52

[ఇది గోకులమున ఆడే దోబూచులాట. వారి ఆటలలో పాటలలో మాటలలో అన్నిటా గోపాలబాలుని చేష్టలే చోటు చేసుకొన్నవి.]

ధన్నాశి

పల్లవి :

బండి విరిచి పిన్నపాపలతో నాడి
దుండగీఁడు వచ్చె దోబూచి

చరణాలు :

పెరుగు వెన్నలుఁ బ్రియమున వే-
మరు ముచ్చిలించు మాయకాఁడు
వెరవున్నాఁ(వున?)దన విధము దాఁచుకొని
దొరదొంగ వచ్చె దోబూచి

పడుచు గుబ్బెత పరపుపై పోక
ముడి గొంగు నిద్రముంపునను
పడియుఁదా(?)వద్దఁబవళించినట్టి
తొడుకుదొంగ వచ్చె దోబూచి

గొల్లపల్లెలో యిల్లిల్లూ చొచ్చి
కొల్లలాడిన కోడెకాడు
యెల్లయినా వేంకటేశుఁడు ఇదె
తొల్లటిదొంగ వచ్చె దోబూచి

# 53

[చందమామ పంట పండినది. అన్నముని పంట పండినది. వేంకటేశ్వరుని ఇంటిలోన పంట పండినది. మన పంటా పండినది. అందుకే ఈ పున్నమనాటి పంట మనకు దక్కినది.]

## రామక్రియ

పల్లవి :

సందెకాడఁ బుట్టినట్టి చాయలపంట యెంత
చందమాయఁ జూడరమ్మ చందమామ పంట

చరణాలు :

మునుపఁ బాలవెల్లి మొలచి పండినపంట
నినుపై దేవతలకు నిచ్చపంట
గొనకొని హరికన్నుఁగొన చూపులపంట
వినువీధి నెగడిన వెన్నెలల పంట

వలరాజు పంపున వలపు విత్తినపంట
చలువై పున్నమనాఁటి జాజరపంట
కలిమి కామినితోడ కారుకమ్మినపంట
మలయుచుఁ దమలోని మఱ్ఱిమానిపంట

విరహుల గుండెలకు వెక్కసమైన పంట
పరగ చుక్కలరాసి భాగ్యముపంట
అరుదై తూరుపుఁగొండ నారఁగఁబండినపంట
యిరవై శ్రీవెంకటేశు నింటిలోనిపంట

# 54

[బాలగోపాలుని సొగసులు, ఉయ్యాలలూచే భామల మురిపెములు ఈ పాటలో పొంగి పొరలినవి.]

## శ్రీరాగం - జంపెతాళం

పల్లవి:

లాలనుచు నూచేరు లలన లిరుగడల
బాలగండవర గోపాల నినుఁజాల

చరణాలు:

ఉదుటుగుబ్బల సరము లుయ్యాలలూగ
పదరి కంకణరవము బహుగతుల మ్రోఁగ
వొదిగి చెంపల కొప్పు లొక్కింత వీఁగ
ముదురు చెమటల నళికములు తొప్పఁదోఁగ

సొలపు తెలిఁగన్నుఁగవ చూపు లిరువంక
మలయు రవళులకుఁ బలుమాఱును బెళంక
కొలఁది కోవిలగములు క్రోలుమదనాంక
ములఁగ్రేణిసేయు రవములు వడిఁదలంక

సరసపదములు జంగచాపుచేఁబాయ
గురులీల మీఁగాళ్ల ( గుచ్చెళ్లు రాయ
కరమూలముల కాంతి కడుఁజాయఁజేయ
సరస నురు కుసుమవాసన లెదురుడాయ

కొలఁది నునుమేను లతకూన లసియాడ
మెలఁకువతొ నొకరొకరి మెచ్చిసరిగూడ
తలలూఁచి చొక్కి చిత్తరు బొమ్మలాడ
అలరి యెల్లరు మోహనాకృతులు చూడ

లలిత తాంబూల రసకలితంబులైన
తళుకుదంతములు కెంపులగుంపులీన
మొలకవెన్నెలడాలు ముసురుకొని తోన
చెలఁగి సెలవుల ముద్దు చిఱునవ్వులాన

మలయమారుతగతులు మాటికిఁజెలంగ
పలుకుఁ గపురపుతావి పైపై మెలంగ
బలుగానలహరి యింపుల రాల్గరంగ
బలసి వినువారి చెవి బడలిక దొలంగ

లలనాజనాపాంగ లలితసుమచాప
జలజలోచన దేవ సద్గుణకలాప
తలఁపు లోపల మెలఁగు తత్త్వప్రదీప
భళిర గండవరేశ పరమాత్మరూప

# అనుబంధం – 1

## సంకీర్తల సంఖ్య అకారాది సూచిక

| సంకీర్తన | రాగము | పాట సంఖ్య |
|---|---|---|
| అనరాదు వినరాదు | దేశాక్షి | 14 |
| అన్నిటికి నిది | లలిత | 19 |
| అమరాంగన | దేవగాంధారి | 13 |
| ఆటవారి గూడి | కన్నడ గౌళ | 33 |
| ఇందిరా రమణుఁ దెచ్చి | బౌళి | 15 |
| ఇటు గరుడని | నాట | 12 |
| ఇతఁడే పరబ్రహ్మ | బౌళి రామక్రియ | 7 |
| ఈ పాదమే కదా | శ్రీరాగం | 6 |
| ఎంత మాత్రము | బౌళి | 5 |
| ఎన్ని బాధలఁ బెట్టి | శ్రీరాగం | 23 |
| ఎవ్వరెవ్వరివాఁడో | నాట | 21 |
| ఏ కులజుఁడేమి | భూపాళం | 29 |
| ఏమని పొగడుదుమే | శంకరాభరణం | 39 |
| కడలుడిపి | శుద్ధవసంతం | 31 |
| కడుపెంత | గుండక్రియ | 26 |
| కామయాగము | కన్నడగౌళ | 41 |

| సంకీర్తన | రాగము | పాటసంఖ్య |
|---|---|---|
| కొండలలో | సామంతం | 2 |
| కొండవేల | భూపాళం | 45 |
| కొలనిలోన | ముఖారి | 50 |
| చాలదా బ్రహ్మ మిది | సామంతం | 36 |
| చాలుఁ జాలును | సాళంగనాట | 44 |
| ఛీ ఛీ నరుల | శంకరాభరణం | 30 |
| తన కేడ | నాట | 24 |
| తొల్లి యును | ఆహిరి | 35 |
| దిమ్మరి గాకేల | సామంతం | 51 |
| దేవ యీ తగవు | మలహరి | 17 |
| దేవునికి | గుండక్రియ | 11 |
| నటనల భ్రమయకు | లలిత | 18 |
| నల్లని మేని | నాఁట | 49 |
| నీడల చూపులు | శంకరాభరణం | 40 |
| పరమాత్ముని | కేదారగౌళ | 32 |
| పసిడి యక్షంత | సామంతం | 10 |
| పుట్టు భోగులము | పాడి | 16 |
| ఫాలనేత్రానల | శ్రీరాగం | 4 |
| బండి విరిచి | ధన్యాశి | 52 |
| మనుజుఁడై | సామంతం | 20 |
| మూడే మాటలు | హిందోళ వసంతం | 22 |

| సంకీర్తన | రాగము | పాట సంఖ్య |
|---|---|---|
| మేడలెక్కి | దేసాళం | 48 |
| మేదిని జీవుల | భూపాళం | 38 |
| మొదలుండఁ | భైరవి | 27 |
| రావే కోడల | పాడి | 43 |
| రూకలై మాడలై | గుండక్రియ | 25 |
| లాలనుచు | శ్రీరాగం | 54 |
| వందే వాసుదేవం | శ్రీరాగం | 3 |
| వలపార | దేశి | 42 |
| వలపుల దాడి | కాంబోది | 46 |
| వాడల వాడల | వరాళి | 34 |
| విజాతులన్నియు | లలిత | 28 |
| వేడుకొందామా | .... | 1 |
| శరణంటి | లలిత | 37 |
| శరణు శరణు | సాళంగనాట | 8 |
| సకలం హే సఖి | నాదరామక్రియ | 47 |
| సందడి విడువుము | ధన్నాసి | 9 |
| సందె కాడఁ | రామక్రియ | 53 |

# అనుబంధం — 2

## లఘువివరణ

1. వేడుకొందామా.... తాళ్ళపాక శేషాచార్యులగారి వ్రాత ప్రతి లోనిది. రాగం పేర్కొనబడలేదు. ఆమటి మ్రొక్కుల వాడు: ఆమడల దూరంనుండి మ్రొక్కుకొంటూ వస్తారు. అటువంటి భక్తులను గలవాడు.

   తోమని పళ్యాలవాడే: వేంకటేశ్వరునికి నిత్య నైవేద్యాలను కుండలలోనే తయారుచేయడం. ఈ మట్టి కుండలు ఎప్పటికప్పుడు కొత్తవే. వీనిని తోమడం ఉండదు. (అని గౌరిపెద్దివారు)

2. కొండలలో.... అధ్యా. రేకు. 25. సం. V. సంకీ. 93.

   ముచ్చిలి, మ్రుచ్చిలి = దొంగిలించి; వెట్టికి = ఊరక జీతబత్తెములకుకాక.

3. వందేవాసుదేవం.... అధ్యా. రేకు. 8. సం. V. సంకీ. 53.

   'కౌస్తుభా' ఈ దీర్ఘం సంగీతంకోసం వచ్చినదా? 'కౌస్తుభ + ఆభరణ' అయినా కావచ్చు.

   కరిరాజ........కరాబ్జమ్: ఇక్కడ వరద శబ్దమునకు రక్షణమని అర్థము కావచ్చునేమో (గౌరిపెద్దివారు)

4. ఫాలనేత్రానల.... అధ్యా. రేకు. 46. సం. V. సంకీ. 184

   గాలి, ఆకాశం, నీరు, భూమి, అగ్ని - ఇవి పంచ భూతాలు. వీని ప్రసక్తి ఉన్నది.

5. ఎంతమాత్రమున.... అధ్యా. రేకు. 179. సం. VII. సంకీ. 159.
దరిశనములు=దర్శనములు. ఇవి ఆరు.
తామెర=తామరయే.

6. ఈ పాదమేకదా.... అధ్యా. రేకు. 10 సం. V. సంకీ. 66.
ఇతవు=హితవు. ప్రియము.

7. ఇతఁడే పరబ్రహ్మ.... అధ్యా. రేకు. 389. సం. XI. సంకీ. 153.
తిరుమల మందిరంలో హనుమత్ సుగ్రీవ సమేత సీతా రామ లక్ష్మణుల ఉత్సవ విగ్రహాలున్నవి. ఈ ఉత్సవబేరములున్న చోటును 'రాములవారి మేడ' అంటారు.
చుప్పనాతి=శూర్పణఖ; సొరిది=వరుసక్రమం. ఒకదాని వెంట ఒకటి; మళ్లివచ్చె=తిరిగివచ్చె.

8. శరణు శరణు.... అధ్యా. రేకు. 171. సం. VII. సంకీ. 113.
రవితనయసచివ=సూర్యుని పుత్రుడైన సుగ్రీవుని మంత్రి హనుమంతుడు. శాతకుంభవర్ణ: బంగారము వన్నె కలిగిన (వాడు); కలశాపురం: అనంతపురం జిల్లాలో గుంతకల్లుకు సమీపంలో ఒకటి వున్నది.

9. సందడి విడువుము.... అధ్యా. రేకు. 2. సం. V. సంకీ. 12.
సాసముఖా : నేటికిని తిరుమల దేవాలయంలో 'సముఖం సముఖం' అనే హెచ్చరికలు స్వామి సన్నిధిలో వినిపిస్తూనే వుంటాయి. సముఖ సముఖ అనే శబ్దాల ద్విరుక్తే ఇది అని గౌ. రా.
ఆలవట్టములు=గుడ్డ విసనకర్రలు; కాళాంజి=తమ్మపడిగ. జమళి: యుగళశబ్దం; జంట. అణిమాదిసిరులు=ఇవి ఎనిమిది. అష్టైశ్వర్యములంటారు. అణిమ,

మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యము, ఈశత్వము, వశిత్వము.

10. పసిఁడియఱుంత.... అధ్యా. రేకు. 234. సం. VIII. సంకీ. 194
తలఁబాలు = తలఁబ్రాలు. తలంబ్రాలు అనీ వ్యవహారం. కలువడాలు = కలువడములు, కలువడాలు — వర్ణలోపము పూర్వస్వర దీర్ఘము. కలువ + వడము. ఉత్సవాది కాలములలో ధ్వజస్తంభము లోనగు వానియందు వ్రేల కట్టెడు బంగారుకలువ పూదండ. [శ.ర.] అందుక: అందుకొని. కొను ధాతువు క్త్వార్థరూపం. పరుష: యాత్రికుల గుంపు; పరిషత్ శబ్దభవం. "నాయాతి పరిష దాయాహి సఖిత్వం" (పండి. పర్వ. ప్ర. పు. 389)

11. దేవునికి దేవికిని.... అధ్యా. రేకు. 185. సం. VII. సంకీ. 189.
కోనేరు = కోన్ ఏరు. కోన్ అంటే ప్రభువు ఏరు-నది. అదే స్వామి పుష్కరిణి అయింది. కదళ్లు = కదలి-అల అలలు, సోబనాలు: సోపానశబ్ద భవంగా తోస్తున్నది.

12. ఇటు గరుడని.... అధ్యా. రేకు. 15. సం. XI. పు. 235.
చూడు. స్వరరచన. లఘుటీక. రా.అ.కృ.శర్మ. తా.పా. II. పు. 22.

ధాయని = ఎక్కిన వాహనమును కదలించు శబ్దము. 'ధే' యనియుఁ గలదు. 'నింగికి ధే యని కదలించెన్' కళాపూ. 3-65. చబుకు చేసినను = కొరడా విదలింపగా. పేరెము = పరుగు; కెల్లున = వేగముగా; ఇది గంటలు మొదలగువాని ధ్వని ననుకరించు పదమైనను గావచ్చును.

13\. అమరాంగన లదె ... అధ్యా. రేకు. 305. సం. X. సంకీ. 26.

తెరలించి = తొలగించి, విప్పి; కెలయుచు = శబ్దము చేయుచు. "కెలయు ధాతువు భావార్థ రూపము. దీనికి 'విజృంభించు' అను శ.ర. లోని యర్థము సామాన్యము 'కెలె' ధాతువునకు కన్నడమున ధ్వనిచేయు అనియే యర్థము కలదు." (రా.అ.కృ. శర్మ. తా.పా. I. పు. 4)

14\. అనరాదు వినరాదు .... అధ్యా. రేకు. 139. సం. VII. సంకీ. 167

దిష్టము = దృష్టము. కాకిజున్ను = అర్థము అస్పష్టము. కాకి బంగారము వంటిదే కాకిజున్ను కూడ. అంటే జున్ను కానిది. కాకివెదురుకు పూసే పూలు తెల్లగ ఉంటాయని వానిని కాకిజున్ను అంటారని ఒకరు తెలిపినారు.

15\. ఇందిరా రమణు.... అధ్యా. రేకు. 373. సం. XI. పు. 92.

పొద్దాయ = పొద్దు ఆయ, అగు ధాతువు భూతకాలిక సమాపకక్రియ అత్వ విశిష్టంగానే ఈ వాఙ్మయంలో కనిపిస్తుంది. మైరావణుడు = రావణునికి వరుసకు తమ్ముడు. పాతాళవాసి. మాయోపాయంతో రామలక్ష్మణులను పాతాళంలో బంధిస్తాడు. హనుమంతుడు ఆ రాక్షసుని చంపి వారిని విడిపిస్తాడు. ఈ కథ అవాల్మీకము. ఘోరనాగ........గరుడా = ఇంద్రజిత్తు వల్ల నాగపాశ బద్ధులై పడివున్న రామలక్ష్మణుల బంధములను గరుత్మంతుడు తొలగించెనని రామాయణము. పానిపట్టి = 'పనిపట్టి' అను శబ్దమునకు జోరుగవాడిన వ్యావహారిక రూపమా అని (గౌ.రా. శృం.సం. 22. పు. 430.) వీరె శృం. సం. 24 పు. 14 లో 'పానిపట్టి', పేనిపట్టి లేక పూనిపట్టి అను వాని వికారముగ తోచుచున్నది అన్నారు.

పోటుబంటు = యుద్ధవీరుడు. అశేష.... శేషమూరితీ= ఆదిశేషుడు స్వామికి అనేక విధముల సపర్యలు చేయును "నివాస శయ్యాసన పాదుకాంశుకోపధాన వర్షాతపవారణాదిభిః శరీర భేదైస్తవ శేషతాంగతైర్య థోచితం శేష ఇతీర్యతే జనైః" అని **యాము**నాచార్యులు. కార్తవీర్యార్జునుడు = మహా హరిభక్తుడు. సహస్ర బాహువులు గలవాడు. హరి సుదర్శనము యొక్క అవతారము.

"ఉద్యత్సూర్య సహస్రకాంతి రఖిలక్షోణీధవైర్వందితో
హస్తానాం శతపంచకేన చ దధచ్చాపానిషూంస్తావతా
కంఠే హాటకమాలయా పరివృతశ్చక్రావతారో హరేః
పాయాత్స్యందన గోఽరుణాభ వసనః శ్రీకార్త
వీర్యో నృపః."

(శ్రీ మన్మంత్ర రత్నాకరే. పు. 485)

పోగొట్టుకొన్న వస్తువు కార్తవీర్యార్జునుని స్మరిస్తే తిరిగి సంప్రాప్తమౌతుందని

"కార్తవీర్యార్జునోనామ రాజా బాహుసహస్రవాన్
తస్య స్మరణమాత్రేణ హృతం నష్టం చ లభ్యతే."

(పు. 485)

16. పుట్టుభోగులము.... అధ్యా. రేకు. 316. సం. X. సంకీ. 94.
పడివాగె = ఎక్కుటకు ఆయత్తపరచునపుడు సవరించెడు గుఱ్ఱపు సవరణ. (శ.ర.) ఓమి = రక్షించి, ఒల్లగె=ఒల్లనె(కన్న) quickly (Kittal) కావచ్చునేమో.

17. దేవ యీ తగవు.... అధ్యా. రేకు. 89. సం. V. సంకీ. 260.
పౌనిగి = నిస్తేజములయి; ఎనగొని = జతపడి.

18. నటనల భ్రమయకు.... అధ్యా. రేకు. 354. సం. XI. పు. 15.
కందువ = చోటు; బహురూపము = నాటకము; డిందు పడు = అడఁగు, ఇంకు; పచారము = అంగడి. (బ్రౌణ్యం)

19. అన్నిటికి నిది.... అధ్యా. రేకు. 361. సం. XI. పు. 43.
చిత్తజగురుఁడు = మన్మథుని తండ్రి విష్ణువు.

20. మనుజుడై పుట్టి.... అధ్యా. రేకు. 32. సం. XI. సంకీ. 262.
పుట్టిన....మనసువెట్టి = కామాతురుడై.

21. ఎవ్వరెవ్వరివాఁడో.... అధ్యా. రేకు. 16. సం. XI. పు. 238.
చూడు. స్వరరచన. లఘుటీక; రా.అ.కృ.శర్మ. తా.పా. II. పు. 18. 'ఎక్కడి చుట్టము తనకు' అనుచో జంపె తాళావర్తమునకు వలసిన పది మాత్రలకు మించి ఒక మాత్ర యెక్కువకలదు. కనుక 'ఎక్కడి' అన్నచోటి కకార ద్విత్వమును తేల బలుకవలసియున్నది. 'తనకీ జీవుఁడు' అని పాఠము కల్పించుకొన్నను, ఈ నడకలో అయిదవ మాత్రకు అక్షరము విఱుగవలసి యున్నదిగాన 'ఎక్కడిచుట్' అన్నచో ఆరు మాత్రలకు విఱిగి నడక చెడును." (రా.అ.కృ. శర్మ)

22. ముంఁడే మాటలు.... అధ్యా. రేకు. 150. సం. VI. సంకీ. 233.
మనికిగా = బ్రతుకుగా.

23. ఎన్నిబాధలఁబెట్టి.... అధ్యా. రేకు. 46. సం. V. సంకీ. 187.
చూడు. స్వరరచన. లఘుటీక. రా. అ. కృ. శర్మ. తా. పా. II పు 82. ఏఁచెదవు = బాధించెదవు. తతి తోడ = సమయమునకు సరిగా. తగులు = సంబంధము. వాసి = గొప్పతనము. ఓసరించి = ప్రక్కకొదిగి.

24. తనకేడచదువులు.... అధ్యా. రేకు. 32. సం. XI పు. 263. జడ్డు = జడత్వము. ఆసవడ్డివారు = ఆశ వృద్ధిపొందు. అది రోజుకు రోజుకు పెరిగేదే. దుడ్డుపెట్లు = కఱ్ఱదెబ్బలు.

25. రూకలై మాడలై.... అధ్యా. రేకు. 92. సం. V. సంకీ. 283. చూడు. స్వరరచన. లఘుటీక. రా. అ. కృ. శర్మ. తా.పా. II. పు. 36. రూక = రూపాయలో నాల్గింటి భాగము. పావలా. (నేడు 25 పైసలు.) రువ్వ = దమ్మిడి; దాకొని = మఱుఁగుపడి. జాళెలు = నాణెములు పోసిపెట్టు సంచులు నిక్షేపము = ఇతరు లెఱుఁగరాక పూడ్చిపెట్టిన లిబ్బి. నగుతా = నగుచు. నవ్వుచు (శత్రర్థం).

26. కడుపెంత.... అధ్యా. రేకు. 69 సం. V సంకీ. 205. చూడు, స్వరరచన. లఘుటీక. రా. అ. కృ. శర్మ. తా. పా. II పు. 39. కుడుపు = తిండి. పాటులు = అవస్థలు. పాట్లు అను రేకులోని రూపము పాట సౌకర్యమునకై విడ దీయఁబడినది. సొరిదిన్ = వరుసగా. మీఁద మీఁద. 'తిరుగుచుండేటి' అనురూపము మాత్రాధిక్యముగలది. చదివి చెప్పని = శ్రుతి స్మృతి పురాణ వాక్యాలు ఉదాహ రించి చెప్పని. పొదిగొన్న = గుంపులుగా పైఁబడిన బుంగుడై = బ్రుంగుపడి-మునిగి; సదమదంబై = నలి నూకలై. చవులు = రుచులు-ఇంద్రియాల తృప్తులు.

27. మొదలుండఁ గొనలకు.... అధ్యా. రేకు. 94. సం. V సంకీ. 291 చూడు. స్వరరచన. లఘుటీక. రా.అ.కృ. శర్మ. తా.పా. II. పు. 7. జరిగెదనంటే = ఆచరించెదనని తలఁచితినేని జనకములు = కలిగించునవి. ప్రపంచ వ్యవహారములు మీఁద మీఁద నీ మాయనే కలిగించు ననుట. 'జనిత

ములు ' (మాయచే కలిగినవి) అని పాఠము కాఁదగును. మట్టున=మితియందు; మతకాలు=మాయలు. సంతకూటాల ధర్మపు సంగతి=సంతలలో చేరు గుంపుల నడతల వంటి ధర్మములు.

28. విజాతులన్నియు.... అధ్యా. రేకు. 177. సం. VII సంకీ. 149. అష్టమదము=ధన, విద్యా, జాతి మొద.సంబంధించినవి. సంపాదము=సంపాదనము. భవనికారము: జన్మమును తిరస్కరించుట. 'భవవికారమ'ని ఉండవచ్చు.

29. ఏకులజుఁడేమి.... అధ్యా. రేకు. 47. సం. V సంకీ. 195. ఆఁకడ=చిట్టచివరికి. సకలమును=సృష్టిని.

30. ఛీ ఛీ నరులదేటి.... అధ్యా. రేకు. 82. సం. V సంకీ. 222. చూడు. స్వరరచన. లఘుటీక. రా. అ. కృ. శర్మ. తా. పా. II 130. ఉడివోని=ఉడిగిపోవని, శాశ్వతమైన. పసురము=పశువు. పసరమని సామాన్యరూపం. పశు శబ్దభవము గనుక పసురమను రూపము గూడ సరియే. కసివోన్=తీట తీరునట్లుగా. ఉసురుమాను=అస్పష్టము. బ్రతికిన మాత్రిను అని చెప్పుకోవచ్చును. కాని విశేషము కానరాదు.

ఎమ్మెలన్=పెద్దరికములచేత. దొమ్ములు=దొమ్మి దొమ్మిగా కూడి పైఁబడునట్టి.

తాళ్లపాక వేంకటశేషాచార్యులగారి ప్రతిలో ఈపాట ముఖారి రాగమని యున్నది.

31. కడలుడిపి.... అధ్యా. రేకు. 36. సం. XI. పు. 281. చూడు. స్వరరచన, లఘుటీక రా.అ.కృ.శర్మ. తా. పా. II. 97

నీరాడఁగా = స్నానము చేయుటకు. దాహము = ఆశ, తగులము. పదార్థమోహము = వస్తువుల మీఁది పేరాస. దినములకు అనియే రేకుల పాఠము; పాట నడక సౌకర్యమునకై 'ను' చేర్పనైనది.

ముందరు = రాఁబోవునది. మొదలు = కడచినది. మూల తత్త్వము.

32. పరమాత్మునినోర.... అధ్యా. రేకు. 21. సం. V. సంకీ. 72. చూడు. స్వరరచన. లఘుటీక. రా.అ.కృ.శర్మ. తా.పా. II. 114. కుందెన = కుదురు; కులికి = అల్లాడించి; కొలుచు = ధాన్యము. తొంగలి రెప్పల = నింపైన రెప్పలుగల: రెండుసంధ్యలును రెప్పలవంటివని ధ్వని. సంగడి కన్నులు = ఒకట నొకటి జతగూడిన కన్నులు. దంగుడు = మెదుగుడు. దీని ప్రేరణ రూపమే దంచు. పనుపడి = వాడుకపడి. విన్నాణి = విజ్ఞాని. జ్ఞానస్వరూపు లనుట.

33. ఆటవారిఁగూడి.... అధ్యా, రేకు. 27. సం. V. సంకీ. 105 చూడు. స్వరరచన. లఘుటీక. రా.అ.కృ.శర్మ. తా.పా. II. 42. గురుతరము = చాల బరువుగలది. కొట్టాము = కొట్టము, రంగస్థలము.

34. వాడల వాడల.... అధ్యా, రేకు, సం. V. సంకీ. 178. చూడు. స్వరరచన, లఘుటీక. రా.అ.కృ.శర్మ. తా.పా. II. 195 పటవాళిచీరలు = నిలువుగానో అడ్డముగానో పట్టెలుగల చీరలు: పడై + వాళ్ = అనఁగా నాగేటికఱ్ఱు అని తమిళభాషలో అర్థము. నాగేటికఱ్ఱుతో దున్నినప్పుడు చేనిలో ఏర్పడిన రేఖలువంటి రేఖలుగల చీర పటవాళి

చీర. అని యూహింప నగును. పూర్వకాలమున ఎక్కు వగా ఇట్టిచీరలకు విలువ యుండెడిది మైలసంత = అస్పృశ్యుల సంత. నేఁతపనిలో పూర్వకాలమున మాల వారు నిష్ణాతులు,

35. తొల్లియును.... అధ్యా. నిడురేకు. 4. సం. XI. పు. 161. చిలు పాలు: Spirtings: the sweetest milk: which bursts forth spontaneously. (బ్రౌణ్యం). తొట్టెలన్: ఉయ్యా లలో, చేరులు = గొలుసులు.

36. చాలదాబ్రహ్మ.... అధ్యా. రేకు. 66. సం. XI. పు. 304. జాలి = దుఃఖము. జంతువులు = ప్రాణి సామాన్యమును. సామము = సామవేదము. శమదమాదులు = బాహ్య అంతర ఇంద్రియాలను లోబరచుకొనుట. చలిగొండ సుత = మంచుకొండకూతురు పార్వతి.

37. శరణంటి.... అధ్యా. రేకు. 104. సం. VI. సంకీ. 24. బాముతో = ఆవేదనతో.

38. మేదిని జీవుల.... అధ్యా. రేకు. 79. సం. XI. పు. 326.

39. ఏమనిసొగడుదు.... ఆమనిసొబగులు = వసంతకాలపు అందాలు. కప్రపుబాగాలు = కర్పూరములు కలిపిన పోకలు. Areca nut ready cut into pieces for eating. (బ్రౌణ్యం) సిరినగరు = ఐశ్వర్యవంతమైన భవనం.

40. నీడలచూపులు... శృం. రేకు. సంఖ్య పేర్కొనబడలేదు. సం. IV. సంకీ. 66. చూడు, స్వరరచన. లఘుటీక. రా.అ. కృ. శర్మ. తా.పా. II. 138. నీడలచూపులు = క్రింది చూపులు. లేదా, నీడలనుచూచి ప్రియుడు వచ్చెనని

తమకముగొనుట. వాడక వాడెడివడ = నిజముగా వాడ కున్నను వాడినట్లు చూపు కృత్రిమ తాపము. నిలువుల నటనలు = నిలిచినట్లు స్తంభించినట్లుచేయు విరహాభి నయములు. నిలుగుల నడపులు = ఒడలు విఱచుకొని నడచుటలు. నెలవుల కరఁగులు = కళాస్థానముల పరవశ త్వములు. నెఱులు = వెంట్రుకలు; నెఱవగు చదురులు = నిండిన నేర్పులు. నెఱతనపు సిరులు = జాణతనమున సంపాదించిన నఖదంతక్షతాది శృంగార విభవములు. ఒక 'నీకేలే' చాలియుండగా రెండవ 'నీకేలే' పాట చదరమునకై వచ్చినది. నిక్కపు బొంకులు = నిజ మును లేదని అపలాపించుటలు. నిక్కల = నిజమైన కల. వేంకటేశ్వరుని ప్రేమకై నీవుకన్న కలలన్నియు నిజమైనవని తా. నిక్కితివి ఒరపులన్ = ఇతర నాయి కలతో స్పర్ధలలో నీవ గెల్చితివని భా. 'దక్కె వేంకటో త్తముఁడు నీకేలే' అను పా. రే. పాఠము మాత్రాధి క్యము చేతను అనన్వితము గావునను వదలఁబడినది. ఈ పాఠము నిడు రేకులు 15-66 లోనిది.

41. కామయోగము.... శృం. రేకు. 69. సం. XII. సంకీ. 223

చూడు స్వరరచన. లఘుటీక. రా.అ.కృ. శర్మ. తా. పా. I. 82. కలికి = జాణయైన నాయిక. పొలుపు = అందము. సోమపానము = యజ్ఞమునందు ఋత్విజులతోఁ గూడ యజమానుడు ఒకానొక తీగరసమును త్రాగును. సోమ లతను 'తిప్పతీగ' అని కొందఱందురు. కలవరంబుల మ్రోత = పావురాలపలుకు మణితము. దరికొన్న = మండెడు. అవభృథము = యజ్ఞము ముగిసినప్పుడు చేయు స్నానము. దంతక్షతక్రీడ = గోటికాటుల విహా రము. రేకులోని 'దంతాక్షత' అను పాఠము పొరపాట నుట స్పష్టము. నునుపు = ఇంపు.

42. వలపారగించవమ్మ.... శృం. రేకు. 4. సం. XII. సంకీ. 25.
బోనము = భోజనము. కళవళములు = ఆందోళనలు

43. రావేకోడల.... శృం. రేకు. 83. సం. XII. సంకీ. 313.
రట్టడి = మోసము చేసిన, అపకీర్తి కలిగించిన. అంకెల తిరుగు = స్వేచ్ఛగ సంచరించు. ఏగురు = ఏవురు, ఐదుగురు. గొద్దెరు = గుత్తకు To rent or farm (బ్రౌణ్యం) గుడ్డము లేక గుడ్డాము A plot of land, Part of field. (బ్రౌణ్యం). అడ్డగించుకొను = అపుగ ఉంచుకొను, మగనిగ చేసుకొను అని తా.

44. చాలుఁజాలును.... శృం. రేకు. 8. సం. XII.— సంకీ. 45.
దిమ్మరి = ద్రిమ్మరి. సృష్టివ్యాపారములు చూడడానికి అంతటా తిరుగువాడు విష్ణువు.

45. కొండవేల.... శృం. రేకు. 756. సం. XXII. సంకీ. 325.
కొండించేరు = కొండెములు చెప్పఁగ. కొల్లల చీరెలు = కొల్లగొట్టిన చీరెలు, గోపికల వస్త్రాపహరణం. గొల్లు వెన్న: గొల్లు =Hubbub, uproar అని బ్రౌణ్యం. కల కల ధ్వని అని. శ. ౘ. అర్థము స్పష్టం కాలేదు. గోవాళులు = యువకులు. కోవరమున్నారు = పొంచివున్నారు. 'కోవురము' అనే రూపము. శత్రువులను కొట్టేందుకు దారిప్రక్కన దాగి వుండుట. (బ్రౌణ్యం. వాటై = అనుకూలమై.

46. వలపులదాడి.... శృం. రేకు. సంఖ్యపేర్కొనబడలేదు. సం. IV. సంకీ. 16. ఎలగోలు = దండుకు ముందు పొయ్యేబలము. The van or front of an army.(బ్రౌణ్యం) బందికాఁడు = బందిపోటు దొంగ. గోరపువెన్నెల = పదనైన వెన్నెల.

పొగరు వెన్నెల ప్రవాహం. రొచ్చుగ = బురదగ. ఇచ్చకాలే = పరిహాస ప్రసంగాలే. గనమాయె = ఘనమాయె. ఎక్కువైనవి.

47. సకలం హే సఖి.... శృం. రేకు. 4. సం. XII. సంకీ. 22. 'ధత్సే' యని యుండఁబోలును. రా. అ. కృ. శర్మ.

48. మేడలెక్కి.... శృం. రేకు. 138. సం. 13. సంకీ. 223. యాల పదాలు—దేసాళం అని రేకులో పేర్కొనబడింది. ఇవి ఏలపదాలు: సంకీర్తన లక్షణంలో వీని లక్షణం ఇట్లా పేర్కొనబడింది:- "నాయకాహ్వాన పూర్వమై నయము గలిగి మ్లేచ్ఛ పరిభాషఁదగి రాగమిశితమైన యేలపాట పదంబు నా నిలఁ జెలంగు, మహితనాయక సంబుద్ధి మధ్యమగుచు". దీనినిగురించి రా. అ. కృ. శర్మ ఇట్లా పేర్కొన్నారు:- 21-వ చరణమే కడపటి ముద్రాచరణముగా నుండునని తోఁచెడిని అందు 'శ్రీవేంకటేశ' శబ్దము పునరుక్తముగా నున్నది. అర్థమందును ఈ శృంగార సంకీర్తనలలో నెల్ల తప్పకయుండు భోగపరిణతియు నిబద్ధమైనది.

(శృం. సం. 13–పు. 139.)

ఉపారము = ఉపహారము, కానుక. ముప్పిరి = ముప్పిరిగొన్న విరహము, అతిశయమైన. పఁజని = పఁజు + అని. a large ear ring; sometimes పాలకియొక్క పంజులు. the poles of a pelankeen. ప్రియుని కర్ణకుండలమనుట - పోలిక బాగుంది. కేళాకుళి = దీర్ఘిక, దిగుడుబావి, సరస్సు. గంటుండగా = గంటి + ఉండగా పెదవిన దంతక్షతము లుండగా. పావురము....యంపి: ప్రేయసీ ప్రియుల ప్రేమలేఖలు మోయుటకు పావుర

ములు చాల అనుకూలించినవి. సందేశాలంపడానికి తిర్యక్కులుజడాలే ప్రాచీనకాలంలో ఉపకరించినవి. హనుమంతుడు (కపి), హంస, చిలుక, పావురము, మేఘం, మొద. గాలిపటమునకూడ ప్రేమలేఖ లంపెడివారు. "సరోజాక్షి....గాలి నాడించు కేలీపటంబందు నందంబుగా విన్నపంబుల్ దగం గస్తూరిన్ వ్రాసి .... కేశవుం దేచి వాక్యంశరస్వచ్ఛ పంక్తిం దదాసక్తిఁ బాఠంబు గావించి యచ్చో నిజప్రేమమున్ వ్రాసి పుత్తేర..." శృంగార దండకం. పెదతిరుమలాచార్యులు. Vol. I. Minor works. T. T. D. 1935. దంతపుఁ బావాలు = దంతపు పావుకోళ్లు.

49. నల్లనిమేని.... శృం. రేకు. 72. సం. XII. సంకీ. 244. చూడు స్వరఁచన. లఘుటీక. రా. అ. కృ. శర్మ. తా. పా. I. 89. పీఁచము = మదము. తిరుపు= గై దువు=చక్రాయుధము. చఱిఁబడ్డ = కొండలోయలోఁ బడిన; పాపకూపమునఁ బడిన. చక్కఁజాయకు = చక్కగా వెలుగునకు. సీటఁ గలిసినట్టి నిండిన చదువులు = సోమకాసురుఁ డపహరించి సముద్రమున ముంచిన వేదాలు పాటిమాలిన= క్రమము దప్పిన. తెఱచి రాజన్నట్టి = ఇది చదరంగపు మాట. ఎదుటి రాజున కడ్డముగానున్న తన కాయను ఎత్తివేసి 'మీ రాజును పట్టుకొందు' అని ఇంకొక జంతువుతో బెదరించుట. దీనినే 'షహా' అనియు అందురు. 'ధ్రువునికి దివ్యపదమిచ్చినాను కాదను వారెవరో చూచెదను!' అను భగవంతుని స్వతంత్ర భావము ఈ పలుకుబడి కర్థము.

50. కొలనిలోన.... శృం. రేకు. 67. సం. XII. సంకీ. 214.

51. దిమ్మరి.... శృం. రేకు. 41. సం. IV. సంకీ. 170
చూడు. స్వరరచన. లఘుటీక. రా.అ.కృ.శర్మ. తా. పా. II. 126. దిమ్మరి=త్రిమ్మరి. సందుగొందులఁ దిరుగు విటుడని తా. కోనేటి తిమ్మడు=కోనేరుగట్టుననుండు తిరుమలరాయఁడు, స్వామి పుష్కరిణి తటమందుండు శ్రీనివాసుడు. పీలిచుట్టుదలవాఁడు=పీలియనఁగా నెమలి యీక; అరవ కన్నడ భాషలలో ఇదే అర్థము. అది చుట్టిన తలగలవాఁడు. జట్టిగొన్న=వెలకుకొన్న, స్వాధీనము చేసికొనిన.

52. బండి విరిచి.... శృం. రేకు. 19. సం. XII. సంకీ. 227.
దోబూచి=బాల్యక్రీడ. బండి విరిచి=శకటాసురుని చంపి. నిద్ర మంపునను=నిద్రలో మునిగివుండగా. తొడుకుదొంగ. తొడుకు=ఎద్దు. వృషభమువలె పొగరుతో ఉన్న అని కాబోలు.

53. సందెకాడ.... అధ్యా. రేకు. 338 సం. XI. పు. 47.
పున్నామ ........ పంట=పున్నమనాటి వెన్నెలపంట, పండువెన్నెలలో కన్నెలు పాడుకొనే పాటను జాజర పాట అంటారు. వెన్నెల తేటకు (రమణుల పాటకు) జాజరపాటకు గట్టిసంబంధమే ఉంది.

54. లాలనుచు నూచేరు.... అన్నమాచార్య చరిత్ర పీఠిక. పు 63. వే. ప్ర. శా. తి.తి. దే. 1949. చూడు. వివరణకు సప్తగిరి, మార్చి 1978. "గండవరము తాళ్లపాక వారికిఁ జెల్లుచు వచ్చిన గ్రామమని తెలియుటచేఁ దమ యూరి స్వామి మీఁద నన్నమాచార్యుఁడో తత్పుత్రపౌత్రులో